ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 27 అక్టోబరు 2024 | 5



అతి వినియోగం ప్రమాదమే..



ప్రతి వస్తువులోను మంచిచెడులు ఉంటాయి. కేవలం మంచిని గ్రహించాలి. కత్తితో వైద్యుడు శస్త్ర చికిత్సలు చేసి ప్రాణాలు నిలబెడతాడు. అదే కత్తితో చెడ్డవాడు ప్రాణాలు తీస్తాడు. ప్రపంచాన్ని అరచేతిలోకి తెచ్చిందే ఇంటర్నెట్.. దానిని స్మార్ట్‌ఫోన్‌లో పరిమితంగా వినియోగిస్తే జ్ఞానమే. ఎడిక్ట్ అయితే ప్రమాదమే. పిల్లలు దేనికి అలవాటుపడితే దానికి బానిసలవుతారు. ఆ పరిస్థితి రాకుండానే తల్లిదండ్రులు జాగ్రత్తపడాలి.

- డాక్టర్ కర్రి రామారెడ్డి, మానసిక వైద్యనిపుణులు, రాజమండ్రి

టెన్త్ పరీక్షలకు 11లోపు ఫీజు చెల్లించాలి

» డీఈవో పిల్లి రమేష్

కాకినాడ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, ఒకసారి హాజరై ఫెయిలైన విద్యార్థులకు, ప్రధానోపాధ్యాయులు పరీక్ష రుసుంను అపరాధ రుసుం లేకుండా నవంబరు 11లోపు చెల్లించాలని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. నామినల్ రోల్స్ డాక్యుమెంట్ల ను కూడా ఆన్‌లైన్ ద్వారా అదే తేదీలోపు సమర్పించాలన్నారు. రూ.50 అపరాధ రుసుంతో నవంబరు 12 నుంచి 18 వరకూ, రూ.200 ఆలస్యరుసుంతో 19నుంచి 25వరకూ, రూ.500 ఆలస్య రుసుంతో నవంబరు 26నుంచి 30వరకూ చెల్లించవచ్చని తెలిపారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో సోమవారంనుంచి నామినల్ రోల్స్ తోపాటు పరీక్షఫీజు, మినహాయింపు విద్యార్థుల ఫీజు, వృత్తి విద్యా ఫీజును స్కూల్ లాగిన్‌లో ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు.

126 దుకాణాలకు అనుమతులు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలకసంస్థ పరిధిలో దీపావళి వ్యాపారాలకు 126 దుకాణాలకు కార్పొరేషన్ అధికారులు అనుమతులు ఇచ్చారు. గ్రౌండ్‌లో 100, బోట్ క్లబ్ పార్కులో 24, మెయిన్‌రోడ్‌లో 1, ఆనంద్ థియేటర్ పక్కనే గ్రౌండ్‌లో ఒకటే వ్యాపారం చేసుకోవడానికి అవకాశం ఇస్తూ అనుమతులు ఇచ్చారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రైతుబజార్‌లో వివాదం పరిష్కరించాలని వినతి

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ బస్టాండ్‌వద్ద ఉన్న రైతుబజారులో రైతులు, ఇంగ్లీష్ కూరగాయల వ్యాపారుల మధ్య వివాదాన్ని పరిష్కరించాలని రైతులు జేసీ రాహుల్‌మీనాకు శనివారం వినతిపత్రం ఇచ్చారు. వైసీపీ హయాంలో కొందరు ఇంగ్లీష్ రకాల కూరగాయలు అమ్మేందుకు దుకాణాలుఏర్పాటు చేసుకుని కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అందులోకి వెళ్లి తమపై దౌర్జన్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. డ్రాలో ఇంగ్లీష్ రకాల కూరగాయలు అమ్మేవారికి మినహాయింపు ఇవ్వవద్దని కోరారు.

కొబ్బరన్నం కాంబినేషన్..
సండే స్పెషల్ 6

పాప ఏడుస్తోంది.. ఉడ్‌వర్డ్స్ పట్టవే.. ఇదీ చాలా సుపరిచితమైన యాడ్.. ఇది ఒకప్పటి మాట.. మరిప్పుడు పాప ఏడుస్తోంది అంటే సెల్‌ఫోన్ ఇవ్వు ఊరుకుంటుందే అనే రోజులు వచ్చేశాయి.. పిల్లలు ఏడాది నుంచే సెల్‌ఫోన్‌కు ఎడిక్ట్ అయిపోతున్నారు.. అదే మంచిదనుకుని.. చిన్నారులకు సెల్‌ఫోన్ ఇచ్చేసి తమ పని తాము చేసుకుంటున్నారు.. సెల్ ఎందుకిచ్చావే అంటే ఫోన్ ఇస్తేనే కానీ ఊరుకోవడంలేదనేది పెద్దల మాట.

ఒక పిల్లాడు తీక్షణగా సెల్‌ఫోన్ చూస్తున్నాడు.. సెల్ ఫోన్ పక్కన పెట్టేసి చదువుకోమని తల్లి చెబుతూనే ఉంది.. అయినా వినకపోవడంతో సెల్‌ఫోన్ లాక్కుని పుస్తకం చేతిలో పెట్టి చదువుకోమని చెబుతోంది. అనంతరం ఆమె టీవీ పెట్టుకుని చూస్తూ ఉంటుంది.. అప్పటికే సెల్‌ఫోన్ లాక్కుందని కోపంతో ఉన్న కుమారుడు.. పక్కనే ఉన్న క్రికెట్ బ్యాట్ తీసుకుని తల్లి తలపై మోదుతాడు.. ఇదీ ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.. సెల్‌ఫోన్‌కు ఎడిక్ట్ అయితే ఎంత ప్రమాదమో చాటి చెప్పింది..

ఒక పెద్దావిడ సెల్‌ఫోన్ చూస్తూ ఇంట్లో వంట చేస్తోంది.. ఫోన్‌లో పడి వంట సంగతి మర్చిపోయింది.. కాసేపటికి కిచెన్ నుంచి పొగలు వస్తున్నాయి.. అయినా ఆమెకు వాసన తగల్లేదు.. ఇంతలో అదృష్టం కొద్దీ ఆమె భర్త ఇంటికి వచ్చాడు.. ఇంట్లో నుంచి వచ్చే పొగను చూసి కంగుతిన్నాడు.. వెంటనే ఏమేవ్ ఏం చేస్తున్నావ్.. ఇల్లు తగలబడిపోతుందే అంటూ పెద్దగా కేకలు వేశాడు.. తేరుకున్న ఆమె కిచెన్‌లోకి వెళ్లి చూసేసరికి వండిన కూర కాస్తా మాడిమసైపోయింది.. కాసేపు ఆగితే మంటలు చెలరేగి పెద్ద ప్రమాదమే జరిగేది.

ఆసుపత్రిలో ఉన్నా.. తల్లిదండ్రులతో షాపింగ్‌లో ఉన్నా.. బైక్‌పై వెళుతున్నా.. కారులో వెళుతున్నా.. ఇంట్లో ఉన్నా.. ప్రస్తుతం చిన్నారుల చేతిలో కనిపించేది ఒక్కటే.. అదే సెల్‌ఫోన్.. బడిలో తప్పించి ప్రతిచోటా చిన్నారుల ప్రపంచం సెల్ బందీగా మారిపోయింది.. అది లేనిదే అన్న ముట్టరు.. అది చూడనిదే స్నాక్స్ తినరు.. అందుకే నేటితరం చిన్నారుల్లో నూటికి 60 శాతం చిన్నారులు నాలుగు కళ్లతో దర్శనమిస్తున్నారు..



ఆదివారం ప్రత్యేకం

సెల్‌కలం!

(ఆంధ్రజ్యోతి- రాజమహేంద్రవరం సిటీ)


అరచేతిలో ఫోన్..కంట్లో నలుసు

» టచ్ చేస్తే బోలెడు వినోదం
» ఎడిక్ట్ అవుతున్న పిల్లలు..పెద్దలు
» సెల్‌ని వదల్లేకపోతున్న వైనం
» దంపతుల మధ్య దూరం
» అటకెక్కుతున్న చదువులు
» ఫోన్లకు బాల్యం బందీ
» మందగిస్తున్న కంటిచూపు
» పక్కదారి పడుతున్న విజ్ఞానం

చందమామారావే.. జాబిల్లి రావే.. కొండెక్కి రావే.. గోగిపూలుతేవే.. అంటూ చందమామను చూపిస్తూ తల్లులు వారి చంటిబిడ్డలకు గోరుముద్దలు తినిపించే రోజులు పోయాయి. ప్రస్తుత ఆధునికయుగంలో యాపిల్ రావే.. ఐఫోనురావే.. మా పిల్లవాడితో ఆడుకోవే.. గేమ్‌లతో రావే.. మా చంటిబిడ్డను అలరించవే అంటూ ప్రసుత్త యుగం తల్లిదండ్రులు చేస్తున్న చిన్నపాటి పొరపాటు భవిష్యత్తులో అది తీవ్రరూపం దాల్చి బాల్యం మంతా సెల్‌కు బానిసలుగా మార్చేసింది. తిండి లేకపోయినా ఉంటున్నారు కానీ పది నిమిషాలు సెల్ ఆగిపోతే ప్రాణం పోయినట్టు నేటి సమాజం తయారైంది. నేటి తరంలో ఏడాది చంటి బిడ్డ మొదలుకుని వృద్ధుల వరకు సెల్ బారిన పడనివారులేరంటే పరిస్థితి ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. కమ్యూనికేషన్ గ్యాప్ రాకుండా ఉండడంకోసం, ప్రపంచ జ్ఞానం కోసం రూపొందించిన అంతర్జాల చరవాణి ఇప్పుడు కొత్తపుంతలు తొక్కి. మనిషి ఆరోగ్యానికి హానికరంగా మారిపోయింది. ఇందులో మంచిని గ్రహించి పరిమిత వినియోగం చేసేవారికంటే చెడును గ్రహించే వారే ఎక్కువయ్యారు. ముఖ్యంగా పిల్లలపై పెనుప్రభావాన్నే చూపిస్తుంది.

తెల్లారింది మొదలు..

మనిషి ఉదయం లేచిన నాటి నుంచి రాత్రి నిద్రించే వరకు ఉన్న సమయంలో సెల్ ఫోనుదే ప్రథమస్థానం. మంచం పైనుంచి లేవగానే ఫోన్.. కాలకృత్యాలు తీర్చుకుంటూ ఫోన్.. బ్రేక్ ఫాస్ట్ చేస్తూ ఫోన్.. ఇలా చెప్పుకుంటూపోతే ఫోన్‌తోనే రోజంతా ఉంటారు.. అఖరికి రాత్రి పడుకునే ముందు అర్ధరాత్రి వరకు ఫోన్‌లోనే ఉంటున్నారు. అది చాలదన్నట్టు ఇంట్లో గృహిణిలకు అంటించారు. ఇప్పుడు వాళ్లు కూడా అనుక్షణం ఫోన్‌లతోనే కాలక్షేపం చేస్తున్నారు. ఇక పిల్లల విషయానికి వస్తే అన్నం తినను అన్నా.. మారం చేసినా ఫోన్ ఇచ్చి వారిని సముదాయిస్తున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ లేకపోతే గోలగోల చేసేవిధంగా కుటుంబమంతా ఎడిక్ట్ అయ్యింది.



చదువులపై పెనుప్రభావం

పిల్లలు అడిగారని తల్లిదండ్రులు ఆలోచించకుండా ఆండ్రాయిడ్ ఫోన్లను ఇస్తున్నారు. ఇదే ఇప్పుడు వీరి చదువుపై ప్రభావం చూపిస్తోంది. చదువుకునే సమయంలో ఫోన్ దగ్గర పెట్టుకుని చాటింగ్‌లు చేయడం, యూట్యూబులు చూడడం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాలు వెతుకులాట చేస్తూ చదువుపై ఏకాగ్రత సన్నగిల్లుతోంది. ఫలితంగా పిల్లలు చదువులో వెనుకబడుతున్నారు. నిజానికి కొన్ని స్కూల్స్, కళాశాలలో సెల్‌ఫోన్లను అనుమతించరు. ఎందుకంటే సెల్‌ఫోన్‌తో ఉంటే చదువు పాడైపోతుందని వారికి తెలుసు. కొన్ని కళాశాలల్లో మాత్రం ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ తప్పనిసరి అంటున్నారు. అవసరం మేరకు వాడితే సెల్‌ఫోన్ విజ్ఞానాన్ని పంచుతుంది. పరిమితిమించి వాడితే వినాశానానికి దారితీస్తుంది. కాబట్టి సెల్‌ఫోన్ ఇవ్వడం తప్పుకాదుకానీ..అది అతిగా వినియోగిస్తేనే తప్పు. తల్లిదండ్రులు మాత్రం అప్రమత్తంగా ఉండాలి.

దంపతుల మధ్య దూరం..


ఒకనాడు కుటుంబ బాంధవ్యాలు ఉండేవి.. పెద్దలు వస్తే చాలా గౌరవంగా చూసేవారు. మరిప్పుడో పెద్దలు వచ్చినా ఎవరి పని వారిదే.. సెల్‌ఫోన్ చూసుకుంటూ కాలం గడిపేస్తున్నారు.. వచ్చిన వాళ్లు వెళ్లిపోతుంటే ఊ అనే చిన్న సమాధానం తప్ప.. క్షేమసమాచారం మాటే మరిచారు. కుటుంబంలో నలుగురు ఉంటే నలుగురు తలో సెల్‌ఫోన్ పట్టుకుని నాలుగు గోడల మధ్య జీవిస్తున్నారంటే పరిస్థితి ఎంతగా మారిపోయిందో అర్థం చేసుకోవచ్చు. రాజమహేంద్రవరంలో ఇటీవల భార్యభర్తలు పార్కుకు వచ్చారు..ఒక మంచి ప్లేస్ చూసుకుని కూర్చున్నారు.. ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటారులే అని చూస్తుంటే అతను ఒక ఫోన్.. ఆమె ఒక ఫోన్ పట్టుకున్నారు.. వచ్చినప్పటి నుంచి వెళ్లే వరకూ కీపాడ్‌పై పైకీ కిందకూ లాగుతూనే ఉన్నారు. చివరికి భార్య లేచి వెళ్లిపోదాం అనే సిగ్నల్ ఇవ్వడంతో భర్త ఫోన్ జేబులో పెట్టుకుని బయలుదేరాడు. అంతలా దంపతుల మధ్య సెల్ దూరిపోయింది. దూరం చేస్తుంది. అంతేకాదండోయ్ సోషల్ మీడియా వాట్సాప్.. ఫేస్‌బుక్.. ఇన్‌స్టా తదితర యాప్‌లతో అనుమానపు చిచ్చురేగుతోంది. కుటుంబాలు విడిపోతున్నాయి. సెల్‌కి ఎడిక్ట్ అయిన భార్యభర్తను పట్టించుకోవడంలేదంటే అతిశయోక్తి కాదేమో.

దెబ్బతింటున్న ఆరోగ్యం


ఆండ్రాయిడ్ ఫోన్‌లకు ఎడిక్ట్ అయినవారు ప్రస్తుతం అనారోగ్య సమస్యలు బారిన పడుతున్నారు. ముఖ్యంగా చంటి బిడ్డకు చూపు మందగిస్తుంది. ఇంట్లో అదే పనిగా సెల్ చూస్తూ ఉండడం వల్ల కంట్లో రెటీనాపై ప్రభావం పడుతుంది. అందుకే పదేళ్ల దాటేసరికే చాలామందికి చూపు మందగిస్తోంది. స్కూల్‌కి వెళితే బ్లాక్ బోర్డు, డిజిటల్ బోర్డుపై అక్షరాలు కనిపించలేని పరిస్థితి. దీనికి ప్రధాన కారణంగా ఫోన్ నిలుస్తోంది. చీకటి గదిలో ఫోన్ చూడడం, ముఖానికి దగ్గరగా ఫోన్ పెట్టుకుని చూడడం వల్ల కంటి సమస్యలు వస్తున్నాయి. 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలు సెల్‌ఫోన్‌లో గేమ్‌లు ఆడుతున్నా తల్లిదండ్రులు పెద్దగా పట్టించుకోకపోవడంతో వారి మానసికస్థితిపై పడుతుంది. ఫ్రీఫైర్, హంటింగ్ తదితర గేమ్‌లు ఆడుతున్న బాలలు ఆ గేమ్‌లో ఉన్న వారిని అనుకరిస్తూ తమలో తామే మాట్లాడుకోవడం, ఆ గేమ్‌లో ఎటాక్‌లు జరిగినప్పుడు ఎదుర్కొనే దృశ్యాలు నిజజీవితంలో జరుగుతున్నట్టు ఫీలై ప్రవర్తించడం వంటివి చేస్తున్నారు. కొంతమంది పబ్‌జీకి ఎడిక్ట్ అయి ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. సరదాగా ప్రారంభమైన సెల్‌గేమ్ బాల్యాన్ని ఆపదలోకి నెట్టివేస్తుంది. ఆండ్రాయిడ్ ఫోను నిద్రించే సమయంలో దిండు వద్ద పెట్టుకోవడం, పక్కన పెట్టుకోవడం వల్ల రేడియేషన్ కారణంగా మనిషి శరీరంలో ఇమ్యూనిటీ తగ్గించడంతోపాటు క్యాన్సర్ కణాలు పెరిగే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. అందుకే సాధ్యమైనంత వరకు ఆం డ్రాయిడ్ ఫోన్లను దూరంగా ఉంచడమే ఉత్తమం.

విద్యార్థుల సమగ్ర సమాచారానికే..

అపార్‌కార్డులు



» 12 అంకెలతో గుర్తింపు కార్డు
» జిల్లాలో కార్డుల జనరేట్ ప్రక్రియ
» ఇప్పటివరకూ 10శాతం పూర్తి



వరదలు సంభవించినప్పుడు, ఏవైనా అగ్నిప్రమాదాలు జరిగినపుడు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలన్నీ వరదల పాలవడమో, కాలి బూడిదవడమో, ప్రయాణ సమయాల్లో వాటిని కోల్పోవడమో జరుగుతుంటుంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలతోపాటు విద్యావిషయక పురోగతిని డిజిలాకర్లో భద్రపరుచుకునేలా ప్రభుత్వం ఆటోమేటెడ్ పెర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్)ను రూపొందించింది. విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని దీనిలో భద్రపరచనున్నారు.

కాకినాడరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):1వ తరగతి నుంచి పీజీ వరకూ చదివే ప్రతి విద్యార్థికి అపార్‌కార్డును అందించేందుకు సంబంధించిన ప్రక్రియను కేంద్రప్రభుత్వం నిర్వహిస్తోంది. అపార్‌కార్డుపై క్యూఆర్ కోడ్‌తోపాటు 12అంకెల గుర్తింపు సంఖ్య ఉంటుంది. జాతీయస్థాయిలో ప్రతి విద్యార్థికి జీవితకాలం ఉపయోగపడేలా ఈకార్డును రూపొందించారు. 12 అంకెల నెంబరు ఆధారంగా విద్యార్థులు ఎక్కడినుంచైనా వారి ధ్రువీకరణ పత్రాలను పొందే వీలుంటుంది. విద్యార్థులకు సంబంధించిన ఆయా అంశాల పురోగతిని పాఠశాలల నిర్వాహకులు అపార్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా వారికి ప్రయోజనం కలుగుతుంది. ఉన్నత విద్య, ఉద్యోగంకోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు, వేరే విద్యాసంస్థలోకి మారినప్పుడు మొత్తం సమాచారాన్ని అందుబాటులో ఉంచుతుంది.

● వన్ నేషన్ వన్ స్టూడెంట్ నినాదం

జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా వన్‌నేషన్ వన్ స్టూడెంట్ నినాదంతో కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ అపార్‌కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది. ఆధార్‌కార్డులు కూడా ఇదే తరహాలో ఉన్నాయి. దేశంలో ఒకవ్యక్తికి ఉన్న ఆధార్ నెంబరు మరో వ్యక్తికి ఉండదు. ఇదే తరహాలో విద్యార్థులకు కూడా గుర్తింపు సంఖ్యను కేటాయించనున్నారు. విద్యార్థులకోసం డిగ్రీలు, స్కాలర్‌షిప్‌లు, రివార్డులు, ఇతర క్రెడిట్‌లతో సహా అకడమిక్ డేటాను డిజిటల్‌గా కేంద్రీకరించడం లక్ష్యంగా పెట్టుకుంది. అపార్‌కార్డులో విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెల గుర్తింపు సంఖ్య ఉంటుంది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ విద్యార్థి వివరాలన్నీ వస్తాయి. 18ఏళ్లలోపు విద్యార్థులకు అపార్ ఐడీని రూపొందించేందుకు తల్లిదండ్రుల అనుమతి కోరుతూ సంబంధిత పాఠశాలల, కళాశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్ అనుమతి పత్రాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే అపార్‌పై అవగాహన కల్పించి అనుమతి పత్రాలను తీసుకుంటున్నారు.వాటిని పాఠశాలలో భద్రపరచి దాని డిజిటల్ కాపీని పాఠశాల సమన్వయకర్త ద్వారా యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తున్నారు.

● విద్యార్థులకు అపార్‌కార్డు చాలా కీలకం

-జి.నాగమణి, ఆర్జేడీ



విద్యార్థులకు భవిష్యత్‌లో అపార్‌కార్డు చాలా కీలకం కానుంది. తల్లిదండ్రులకు దీనిపై అవగాహన కల్పిస్తూ వారి సమ్మతి పత్రాలను తీసుకునేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి. ఈ కార్డు ద్వారా ఒక్క క్లిక్‌తో సమాచారాన్ని తెలుసుకునే వీలుంటుంది.

కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, సెకండరీ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులు 2,98,956మంది ఉండగా వారిలో ఇప్పటి వరకూ 30,000 వరకూ గల విద్యార్థులకు అపార్ కార్డులను జనరేట్ చేశారు. అంటే సుమారుగా 10శాతం మంది విద్యార్థులకు మాత్రమే ఈప్రక్రియ పూర్తయింది.

● అపార్ ప్రయోజనాలు

జాతీయస్థాయిలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను ఇప్పటికే యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నిక్షిప్తం చేశారు. వాటికి అనుగుణంగా అపార్ కార్డుకోసం హెచ్‌ఎం ధ్రువీకరణతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఐడీ వచ్చిన అనంతరం ధ్రువీకరణకోసం తల్లిదండ్రులు నమోదు చేసుకున్న ఫోన్ నెంబరుకు నిర్ధారణకోసం ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేయగానే ఆన్‌లైన్‌లో అపార్ గుర్తింపు కార్డు జారీ చేస్తారు. ఇది విద్యార్థి బ్యాంకు ఖాతా వివరాలతో అనుసంధానమవుతుంది. విద్యార్థి ప్రవేశపరీక్షలు, ఉపకార వేతనాలు, ఉద్యోగాల భర్తీ సమయంలో ఈ కార్డు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ఉత్తమ సేవలందించిన డీఆర్వో: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా తిప్పేనాయక్ 9నెలలపాటు ఉత్తమ సేవలు అందించారని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిల్లా రెవెన్యూ అధికారిని బదిలీ చేయడంతో శనివారం కలెక్టరేట్‌లో డీఆర్వో తిప్పేనాయక్‌కు కలెక్టరేట్ అధికారులు సిబ్బంది వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ భావన, ఇతర అధికారులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఐఐపీటీ, అమెరికన్ టీటీ కంపెనీల ఆధ్వర్యంలో.. ఇండస్ట్రీ ఇంటరాక్షన్

జేఎన్టీయూకే, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకే అలూమ్నీ ఆడిటోరియంలో ఐఐపీటీ, అమెరికన్ టెలీఫోన్, టెలిగ్రాఫిక్(ఏటీటీ) కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో ఐఐపీటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీటీ కృష్ణ అధ్యక్షతన ఇండస్ట్రీ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనీఈకేలోని బీటెక్ సీఎస్ఈ, ఈసీఈ తృతీయ, ఆఖరి సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏటీటీ కంపెనీ ఆసియా పసిఫిక్ రీజినల్ హెడ్ పద్మజా శ్రీరామ్, సీనియర్ స్పెషలిస్ట్ ఎస్.గోపీనాథ్ రీసోర్స్ పర్సన్లుగా వ్యవహరించగా యూనీఈకే టీపీవో డాక్టర్ కరుణ సమన్వయకర్తగా వ్యవహరించారు. పద్మజాశ్రీరామ్ మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ టెలిఫోన్ సేవలకు అమెరికాలోని ఏటీటీ కంపెనీ పేరుగాంచడంతోపాటు ప్రపంచంలో 3వ అతిపెద్ద టెలికమ్యూనికేషన్స్ కంపెనీ అన్నారు. అనంతరం గోపీనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు సాఫ్ట్‌స్కిల్స్‌తోపాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్ భావవ్యక్తీకరణ అంశాలపై దృష్టిపెట్టాలని సూచించారు. అమెరికన్ టెలిఫోన్, టెలిగ్రాఫిక్ కంపెనీ ప్రతినిధులు ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణను వీసీ చాంబర్‌లో కలిశారు. రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ ఎస్.మోహన్‌రావు, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్.రామకృష్ణయ్య, ఈసీఈ విభాగాధిపతి లీలాకుమారి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేయాలి: జేసీ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేయాలని జేసీ రాహుల్‌మీనా అన్నారు. కలెక్టరేట్ వివేకానంద సమావేశమందిరంలో ప్రజాఫిర్యాదులపై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలను ఆయాశాఖల అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇప్పటివరకు పరిష్కరించిన దరఖాస్తులు, పరిష్కరించినవి, సంతృప్తికరంగా లేని అర్జీలు పరిష్కరించకపోవడానికి గల కారణాలు అన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. ట్రైనీ కలెక్టర్ భావన, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఘనంగా వైట్ కోట్ కార్యక్రమం

కాకినాడ క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కొత్తగా వైద్య విద్యాభ్యాసంలోకి అడుగుపెడుతున్న విద్యార్థుల జీవితంలో మర్చిపోలేని మధుర స్మృతులను వైట్‌కోట్ మిగులుస్తుందని ఇనాటమేన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ఛైర్మన్ లక్ష్మి దుగ్గిరాల అన్నారు. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో ఫిజియాలజీ లెక్చర్ గ్యాలరీలో ప్రిన్సిపాల్, ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్‌వర్సిటీ వీసీ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆధ్వర్యంలో వైట్‌కోట్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. వైద్యవిద్యార్థులకు నైతికతపై వివరిస్తూ సమాజంలో వైద్యవృత్తికి ఉన్న ప్రాధాన్యం మరే రంగానికి లేదన్నారు. వైట్‌కోట్ విశిష్టతపై విద్యార్థులకు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, డాక్టర్ డీఏవీఎస్ శశి అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని 2021 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో డాక్టర్ ప్రమోదిని, డాక్టర్ సతీష్ మార్గదర్శకంలో నిర్వహించారు. అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మిదుగ్గిరాలను ఘనంగా సత్కరించారు.

గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గృహనిర్మాణ పనులు వేగవంతం చేసి రానున్న మార్చి నాటికి ఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో హౌసింగ్, ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులు, అంగన్‌వాడీ కేంద్రాలు తాగునీరు మొదలైన వాటిపై శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో హౌసింగ్ అధికారులు గృహనిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఇంటిపనులు ప్రారంభించిన ప్రతిచోట మార్చినాటికి పూర్తిచేయాలన్నారు. జేసీ రాహుల్‌మీనా, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీపీవో రవికుమార్, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో.. ఓపెన్‌హౌస్

» పోలీసు విధులు, ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ

కాకినాడ క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ఓపెన్‌హౌస్‌కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో శాంతిభద్రతల పర్యవేక్షణ, ప్రజల ప్రాణ, ఆస్తి కాపాడడం, పోలీసుల విధులు,హక్కులు, సంఘవిద్రోహులు, నక్సల్స్ కార్యకలాపాలను నిరోధించడంలో పోలీసులు నిర్వహించే విధులతోపాటు ఆయుధాల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేరస్థులను పట్టుకునేందుకు ఉపయోగించే సాంకేతిక పరికరాలు, కమ్యూనికేషన్ సిస్టమ్, బాంబ్ టెక్షన్, డిస్పోజల్ సామాగ్రి, నేరస్తులను పట్టుకునేందుకు వినియోగిస్తున్నపోలీసు జాగిలాలు, డ్రోన్స్ వినియోగం, వేలిముద్రలుసేకరణ, బాడీవార్న్ కెమెరాల వినియోగంపై అవగాహన కల్పించి ప్రదర్శించారు. బ్రీత్ ఎనలైజర్లు, ఎల్ హెచ్‌ఎంఎస్, సిగ్నల్స్, స్పీడ్ గన్స్ తదితర పరికరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఓపెన్‌హౌస్ ఆదివారంకూడా జరగనుంది.

సండే స్పెషల్

కొబ్బరన్నం కాంబినేషన్..

ఇప్పుడు ఇదే ట్రెండింగ్.. మెనూలో కొబ్బరి అన్నంతో వెజ్, నాన్‌వెజ్ వంటకాలు



కాస్త జిహ్వా చాపల్యం ఉన్న వాళ్లకు వెజ్ అయినా, నాన్‌వెజ్ అయినా బిర్యానీ మాట వినబడగానే నోరు జివ్వున లాగుతుంది. కానీ మసాలాలు, పొడులు, నూనె వగైరా చాలామంది ఉదరాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. ఇక నాణ్యత లేని సరుకులతో చేస్తే అనారోగ్యమే. బిర్యానీ కంటే సులభంగా తయారయ్యే ఆరోగ్యమైన వంటకం ఈమధ్య ట్రెండింగ్‌లోకి వచ్చింది. అదే కొబ్బరన్నం. మన పూర్వీకులు వండి వార్చిన వంటకమే. కాకపోతే ఇవాళ రెస్టారెంట్లలో ఈ డిష్‌కి విపరీతమైన ఆదరణ పెరిగింది. మసాలా పొడులు, ఎసెన్సులు వంటివి లేకుండానే.. వంటనూనె వాడకుండానే తయారైపోతుంది. పైగా కొబ్బరి పాలతో చేసే ఈ అన్నం ఆరోగ్యానికీ మేలు. దీంతో ఈమధ్య కొబ్బరి అన్నం (కోకోనట్ రైస్) మెనూలో చేరిపోయింది. నిజానికి మన ఇంట్లో ఇప్పటికీ పిల్లలకు లంచ్ బాక్స్‌లోకి తరచూ రెడీ చేసే రెసిపీ కూడా ఇదే. కొబ్బరన్నం వెజ్‌తోను, నాన్ వెజ్ అయితే కోడికూరతో కలిసి వేడివేడిగా లాగించేస్తే అబ్బో దాని రుచే వేరు.

(ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం/ కాకినాడ కార్పొరేషన్)

ఈరోజు ఆదివారంకదా.. ఏమిటి స్పెషల్ అనుకోని వారుండరు. అటు వెజ్, ఇటు నాన్‌వెజ్ ప్రియులు ఏదొక ప్రత్యేక వంటకం కోసం ఎదురు చూస్తారు. ఇంట్లో కాకుండా బయటకు వెళితే కచ్చితంగా బిర్యానీ మెనూలో ఆర్డర్ చేస్తారు. ఇది కూడా వెజ్, నాన్‌వెజ్‌లో ఓ డజను రకాలు. కానీ మషాల్వాలు, రకరకాల పొడుల ఘాటు కొందరిని ఇబ్బందిపెడుతుంది. ఈనేపథ్యంలో కొబ్బరన్నం కాంబినేషన్‌లో అనేక వంటకాలను ఈమధ్య రెస్టారెంట్లు తమ మెనూ కార్డులో చేర్చాయి. పేరున్న హోటళ్ల నుంచి చిన్న చిన్న కర్రీ పాయింట్ల వరకు కొబ్బరన్నం కాంబినేషన్ వంటకాలను అందిస్తున్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం తదితర నగరాల్లో అయితే కొబ్బరన్నంతో కలిపిన వంటకాలను మాత్రమే విక్రయించే ప్రత్యేక కిచెన్ పాయింట్లూ వెలిశాయి. మరికొందరు సేంద్రియ ఉత్పత్తులతో కూడిన కొబ్బరన్నం కాంబినేషన్ వంటకాలు తమ స్పెషల్ అని ప్రకటించుకుంటున్నాయి. ఎందుకింత క్రేజ్ పెరిగిందో తెలియదుగాని వీటికి ఆర్డర్లూ బాగా పెరిగాయి. నిజానికి కొబ్బరన్నం మనకు కొత్తేమీ కాదు. పూర్వీకుల నుంచి ఉన్న వంటకమే. ఇప్పటికీ వంటిళ్లలో పిల్లల కోసం అప్పుడప్పుడూ స్పెషల్ రెసిపీ అంటూ తల్లులు చేస్తూనే ఉంటారు. దీన్ని మార్కెట్ పట్టుకుంది. నూనెలు, పెద్దగా మషాలాలు లేకుండా స్పెషల్ ఫుడ్ కావాలనుకునే వారి కోసం కోకోనట్ రైస్‌తో కూడిన వంటకాలను అందిస్తున్నారు. మీరూ ఓసారి చూసేయండి మరి.

ఇలా వండేద్దాం..

రెండు కప్పులు (సుమారు పావుకిలో) బియ్యానికి సరిపడా ఏమి కావాలో చూద్దాం. ముందుగా కొబ్బరి పాలను సిద్ధం చేసుకోవాలి. అప్పటికప్పుడు చేస్తేనే రుచి తగ్గకుండా ఉంటుంది. మరీ లేత, మరీ ముదురుకాకుండా మధ్యస్తంగా ఉండే ఒక మీడియం సైజు కొబ్బరికాయను తీసుకోండి. దానిని బద్దలుకొట్టి నీటిని తీసేయండి. కొబ్బరిని వేరుచేసి చిన్న ముక్కలుగా కోసి మిక్సీలో వేసి ఓ గ్లాసు నీళ్ల వెయ్యండి. మిక్సీ చేసి జ్యూస్ జల్లెడ, టీ వడకట్టు, శుభ్రమైన క్లాత్‌లో పోసి పాలను వడకట్టుకోవాలి. ఓ రెండు సార్లు ఇలా చెయ్యవచ్చు. పాలు మరీ చిక్కగా ఉంటే అన్నం వెగటు వస్తుంది. మరీ పల్చగా ఉంటే రుచి తగ్గిపోతుంది. అందువల్ల మధ్యస్తంగా ఉండేలా పాలను తీసుకొని పక్కన పెట్టుకోండి. వండటానికి ఎలక్ట్రికల్ లేదా మామూలు కుక్కర్ అయితే బాగుంటుంది. బియ్యాన్ని శుభ్రంగా కడిగిన తర్వాత దానిలో ఒకటికి రెండు లెక్కన ముందుగా రెడీ చేసుకున్న పాలు వేయాలి. మూడొంతుల పాలు ఒక వంతు నీళ్ల ఉన్నా ఫర్వాలేదు. మధ్యకు చీరిన మూడు పచ్చిమిర్చి, సరిపడా ఉప్పు, చిన్న దాల్చిన చెక్క, నాలుగు చొప్పున యాలికలు, లవంగాలు, పలావు ఆకులు, మరాఠి మొగ్గలు, స్టార్ పువ్వు ఒకటి, కొత్తిమీర, ఒకవేళ ఉంటే చాలా తక్కువగా పుదీనా ఆకులు, జాజికాయ, జాపత్రి, జీలకర్ర, షాజీరా వేసుకోవాలి. పసుపు (రంగుకోసం), మిరియాలు, కరివేపాకు, జీలకర్ర, పెరసపప్పు, జీడిపప్పు, తరిగిన అల్లం వంటివి మీ ఇష్టం. అల్లం, వెల్లుల్లి పేస్టు, వంటనూనె, మషాలా తదితర పొడులు అవసరం లేదు. ఇప్పుడు కుక్కర్ మూత పెట్టి రెండు విజిల్స్ రానివ్వాలి. ఆవిరి తగ్గిన తర్వాత మూత తీసి చూస్తే నోరూరించే.. ఆరోగ్యకరమైన వేడివేడి కొబ్బరి అన్నం సిద్ధం. మాంసాహారులైతే కోడికూర (గ్రేవీగా) తప్పనిసరిగా ఉండాల్సిందే. శాకాహారులైతే బంగాళా దుంప, మష్‌రూమ్, పన్నీరు, జీడిపప్పు ఇలా ఇష్టమైన కాంబినేషన్‌తో లాగించేయవచ్చు. రైతా(ఉల్లి చెట్నీ) మీ ఇష్టం.

● ఆరోగ్య విలువలు ఇవీ..

కొబ్బరి పాలు సహజ మాయిశ్చరైజర్‌గా పని చేస్తాయి. కొబ్బరి పాలలో విటమిన్ ఏ,బీ,సీ, కాల్షియం,



పా స్ఫరస్, ఐరన్, సహజ పిండి పదార్థాలు, ప్రొటీన్స్ పుష్కలంగా లభిస్తాయి. కొబ్బరిలో ఉండే సైటోకైనిన్స్ చర్మంలోని వృద్ధాప్యపు ఛాయలను నెమ్మదించేలా చేస్తాయి. కొబ్బరిలోని ఎంజైములు ఉదరంలోని యాసిడ్ రిఫ్లెక్స్‌ని అరికడతాయి. కొబ్బరి పాలు జీవక్రియలను పెంపొందిస్తాయి. బరువును తగ్గిస్తాయి. మంచి కొలెస్టరాల్, జుట్టు వృద్ధి, చర్మానికి నిగారింపు వస్తుంది. గుండెకు మేలు చేస్తుంది. 100 గ్రాముల కొబ్బరిపాలలో 230 కిలోల క్యాలరీల శక్తి, 2గ్రా. డైటరీ ఫైబర్, 23.8గ్రా. కొవ్వులు, 3.3గ్రా. చక్కెర, 3గ్రా. ప్రొటీన్లు, 5గ్రా. కార్బోహైడ్రేడ్స్, 15గ్రా.కాల్షియం, 3గ్రా.విటమిన్ సి, 0.7మి.గ్రా జింక్, 100మి.గ్రా భాస్వరం, 37 మి.గ్రా మాంగనీస్, 37మి.గ్రా మెగ్నీ షియం, 2 మి.గ్రా ఇనుము, 265మి.గ్రా పొటాషియం ఉంటాయి.






ఆరోగ్యకరమైన ఆహారం కోరుకునే వారికి కొబ్బరన్నం ఇప్పుడు స్పెషల్ రెసిపీ. ఇందులో పెద్దగా మసాలాలు, టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్స్ వాడం. తాజా కొబ్బరి పాలు, సోనామసూరీ బియ్యంతోపాటు యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క, అనాస పువ్వు వంటివి మాత్రమే వాడతారు. ఇది ఆరోగ్యం. తేలికగా జీర్ణం అవుతుంది. కొబ్బరన్నం కాంబినేషన్ వంటకాలను మాత్రమే విక్రయిస్తాం.

- టి.చరణ్, ఉగ్గు ఫుడ్స్, వలసపాకల, కాకినాడ

కవిత్వమై.. పుట్టింది!



- 'కవిసంధ్య' 50 సంచికల విజయయాత్ర
- నేడు యానాంలో స్వర్ణోత్సవ సభ
- 13 మందికి ప్రతిభా పురస్కారాలు



పత్రిక నిర్వహణ కష్టమైన పని. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. అందులోనూ కేవలం కవిత్వం మీదనే ఒక పత్రిక నడపడమంటే ఆషామాషీ వ్యవహారం కాదు.. ఈ బాధ్యతను ప్రముఖకవి శిఖామణి ఎప్పుడో భుజానకెత్తుకున్నారు. యానాం కేంద్రంగా కవిత్వమే ప్రధానంగా 'కవిసంధ్య' ఆరంభమైంది. ఎనిమిదేళ్ల కిందట మొదలైన ఈ ప్రయాణం తాజాగా స్వర్ణోత్సవ సంచికను తీసుకువచ్చింది. ఈ సందర్భంతోపాటు ఏటా కవిసంధ్య పేరిట జరిగే పురస్కారాల వేడుకను కూడా ఈనెల 27 ఆదివారం ఉదయం తొమ్మిదిన్నరకు యానాంలోని గీతాభవన్‌లో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ, అనంతరం వాడ్రేవు చినవీరభద్రుడు, పాయల మురళీకృష్ణలకు కవితా పురస్కారాలను ప్రదానం చేస్తారు. అలాగే శిఖామణి మలయాళ కవిత్వ గ్రంథావిష్కరణ, కవిసమ్మేళన కార్యక్రమాలు జరగున్నాయి. అదేవిధంగా కవిసంధ్య ప్రతిభా పురస్కారాలను మరో 13 మందికి అందజేయనున్నారు. కవిసంధ్య సంపాదకుడు, కళారత్న శిఖామణి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, అతిథులుగా సాహితీవేత్తలు డాక్టర్ దీర్ఘాశి విజయ్ భాస్కర్, డా.సి.మృణాళిని, డా.వీరలక్ష్మీదేవి, డా.ఆర్.సీతారాం, డా.వరుగు భాస్కర్‌రెడ్డి, దాట్ల దేవదానంరాజు హాజరవుతారు.

శిఖామణి ఏమంటున్నారంటే..



నాడు 16 పేజీలతో తొలి అడుగు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ విడిపోయిన తర్వాత 2015లో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉద్యోగ విరమణ పొందాను. అప్పటికే రెండు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో కవిసంధ్య సాహిత్య కార్యక్రమాలను నిర్వహించింది. రాష్ట్ర విభజన తర్వాత కవిసంధ్య కార్యక్షేత్రాన్ని నా స్వగ్రామం కేంద్రపాలిత ప్రాంతమైన యానాం మార్చాను. యానాంలో 2016 ఏప్రిల్ 8న ఉగాది వేడుకలకు కవిసంధ్య కవిత్వ పత్రికగా వెలువడింది. ఏప్రిల్-మే ద్వైమాసిక సంచికగా యుగకర్త కందుకూరి వీరేశలింగం పంతులు ముఖచిత్రంలో 16 పేజీల సంచికగా వెలువడింది. ఇప్పుడు స్వర్ణోత్సవ సంచిక 136 పేజీలతో వెలువడుతోంది.

కవిత్వానికి పత్రిక కావాలి

ఒకప్పుడు తెలుగులో కథకు, నవలలకు ప్రత్యేక పత్రికలుండేవి. ఆంధ్రజ్యోతి వీక్లీలో ఈవారం కవిత పేరుతో ఒక పేజీ కేటాయించేవారు. సండే మ్యాగజైన్లో కూడా కవిత్వానికి ఒక పేజీ ఉండేది. ప్రస్తుతం నేను ప్రముఖ కవులు, రచయితల సంతకాలు సేకరించి కవిత్వ పేజీ అవసరాన్ని గుర్తుచేస్తున్నాను. కవిత్వానికి స్థల నిర్దేశం చేయడం పోలీసింగ్ లాంటిది. కవిత్వానికి పోలీసింగ్ మంచిదికాదు. గతంలో కంజిర, సంతకాలు, జముకు, చైతన్య కవిత వంటి పత్రికలు వచ్చి ఆగిపోయాయి. కవిత్వానికి ఒక పత్రిక అవసరం.

ప్రయత్నం... ప్రయాస కాదు..

కవిసంధ్య సన్నాహక సభలో మిత్రులు అన్నట్టు రచనలు వచ్చినంతగా చందాలు రావన్నది అనుభవం మీద తెలిసింది. తొలి సంవత్సరంలో సాహితీ మిత్రులు ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిది. తర్వాత రచనలు అడిగినంత చనువుగా చందాలు, రెన్యూవల్స్ అడగలేకపోయాం. కవిసంధ్య తయారీ హైదరాబాద్‌లో.. ప్రింటింగ్ విజయవాడలో.. పోస్టింగ్ యానాంలో.. ఒక అరడజను మిత్రులతో కలిసి యానాం కవిసంధ్య ఆఫీసులో కూర్చుని పత్రికలకు పోస్టింగ్‌కు సిద్ధం చేసేవాళ్లం. ఇప్పటికీ ఇదే కార్యక్రమం. అయినప్పటికీ ఇది ఆనందమేకానీ ప్రయాసకాదు.

జ్ఞాపకాలు, సన్నివేశాలు...

పత్రిక ప్రారంభించాక కొత్తలో ప్రముఖ రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి పది వేల చెక్కును పంపించారు. అది కవిసంధ్య పేరు మీద ఉంది. అప్పటికి కవిసంధ్యకు ఇంకా బ్యాంకు అకౌంట్ తెరవలేదు. అదే విషయం ఆమెకు చెబితే నా పేరున మరో చెక్కు పంపారు. కవిసంధ్య పేరున ఉన్న చెక్కును తిరిగి పంపుతుంటే వద్దు అకౌంట్ తెరిచాక అది కూడా బ్యాంకులో వేసుకోండి అన్నారామె. పేరు చెప్పడానికి ఇష్టపడని అజ్ఞాత సౌజన్యమూర్తులూ కొందరు కవిసంధ్యకు అండగా ఉన్నారు. నాకు కవిగా పదుల సంఖ్యలో చిన్నా పెద్దా పురస్కారాలు వచ్చాయి. అయితే ప్రముఖ పద్యకవి అనుమాండ్ల భూమయ్య ఇటీవల పద్యకవి సత్కార సభలో కవిసంధ్య పత్రిక సంపాదకుడిగా నన్ను పిలిచి సత్కరించడం కవిసంధ్యకు, సంపాదకుడిగా నాకు దక్కిన తొలి సత్కారం ఇది.

ఇక భవిష్యత్తు ఆలోచన...

కవిసంధ్య 50 సంచికలను మనసు ఫౌండేషన్ రాయుడు సౌజన్యంతో డిజిటలైజేషన్ చేసి భవిష్యత్తరాలకోసం భద్రపరచాలనే ఆలోచనగా ఉంది. వచన కవిత్వం వందేళ్లు పూర్తి చేసుకోబోతున్న తరుణంలో వందేళ్ల వచన కవిత పేరుతో ఒక సంకలనం తెచ్చే యోచన ఉంది. - ఆంధ్రజ్యోతి/యానాం



సభలో మాట్లాడుతున్న చందు సుబ్బారావు, మృణాళిని

సోమసుందర్ సాహిత్యం.. నేటి తరానికి తెలియజేయాలి

ఆవంత్స శత జయంతి సభలో సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి కన్వీనర్ మృణాళిని

పోర్టుసిటీ (కాకినాడ), అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): వజ్రాయుధకవి ఆవంత్స సోమసుందర్ సాహిత్యాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత సాహితీవేత్తలపై ఉందని ప్రముఖ రచయిత్రి, సాహిత్య అకాడమీ (న్యూఢిల్లీ) తెలుగు సలహా మండలి కన్వీనర్ సి.మృణాళిని అన్నారు. కాకినాడ గాంధీ భవన్‌లో సోమసుందర్ శత జయంతి సభను సాహిత్య అకాడమి, క్రియా సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో మృణాళిని మాట్లాడుతూ సోమసుందర్ 100కుపైగా పుస్తకాలు రాశారన్నారు. ప్రముఖ సాహితీవేత్త చందు సుబ్బారావు మాట్లాడుతూ సోమసుందర్ ఆత్మకథలో ఆయన జీవితంలో జరిగిన సంఘటనలన్నీ ఉన్నాయన్నారు. జీవితచరిత్ర అంటే ప్రతి సంఘటన ఉండాలని ఆయన కోరుకు నేవారని, ఆయనతో అప్పట్లో సన్నిహితంగా మెలిగిన స్నేహితురాలి గురించీ జీవిత చరిత్రలో రాయడం ఆయనకే చెల్లిందన్నారు. డాక్టర్ జి.సీతారామస్వామి మాట్లాడుతూ సోమసుందర్ పేదల వైపు నిలబడి అభ్యుదయకవిగా పేరు తెచ్చుకున్నారన్నారు. సదస్సులో క్రియా సొసైటీ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, సాహితీవేత్తలు నందిని సిధారెడ్డి, ఎన్.ఈశ్వరరెడ్డి, బొల్లోజు బాబా, వాడ్రేవు వీర లక్ష్మీ దేవి, కస్తూరి నాగమురళీశంకర్, నండూరి రాజగోపాల్, ఆర్.సీతారామారావు, మేకా మన్మథరావు, శిఖామణి, మేకా మన్మధరావులు పాల్గొన్నారు.





సర్వాంగ సుందరంగా అలంకరించిన బాలబాలాజీ ఆలయం. పక్క చిత్రంలో పవిత్రోత్సవాలకు స్వామివార్లను తీసుకుని వస్తున్న అర్చకులు

వైభవంగా ప్రారంభమైన పవిత్రోత్సవాలు

ఆధ్యాత్మికతతో కళకళ్లాడిన అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం



స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం చేస్తున్న అర్చకులు

మామిడికుదురు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి పవిత్రోత్సవాలు పంచారాత్ర ఆగమానుసారం త్రయాహ్నిక దీక్షతో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. చినజీయర్‌స్వామి శిష్య బృందం, చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, గొడవర్తి శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో విశ్వక్సేనారాధనతో ఈ పవిత్రోత్సవాలు వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రారంభమయ్యాయి. ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, పరిషత్ దక్షిణ రుత్విక్ వరుణ, రక్షాబంధన పూజ, అంకురార్పణాంగ వాహనం, చతుష్టానార్చనలు, అగ్ని ప్రతిష్ఠాపన, పవిత్ర ఆదివాసం, శ్రీవారికి నవకలశ స్నపన నివేదన, మంగళ శాసనం తదితర పూజలను అర్చకులు జరిపారు. ఈ పవిత్రోత్సవాల వల్ల స్వామివారిలో తేజస్సు కలుగుతుందన్నారు. దోషాలు పరిహారం అవుతాయని, శ్రీవారి కటాక్షంతో లోకశాంతి, విశ్వశాంతి కలుగుతుందని అర్చకులు ఉత్సవాల విశిష్టతను భక్తులకు వివరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దేవస్థానంలో సుప్రభాత సేవ..

బాలబాలాజీ దేవస్థానంలో ప్రతి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు. శనివారం స్వామివారి మేలుకొలుపు అనంతరం తొలిహారతిని ఘనంగా జరిపారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మారుమోగింది. ప్రతి శనివారం జరిగే తొలిహారతిలో భక్తులు స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ ఏసీ కోరారు.

వ్యవసాయాధికారులుగా పదోన్నతులు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 26: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు వ్యవసాయ విస్తరణాధికారులకు మండల వ్యవసాయాధికారులుగా పదోన్నతి ఇస్తూ వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు ఉత్తర్వులు జారీ చేశారని వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధవరావు తెలిపారు. సీతానగరం మండలంలో పనిచేస్తున్న పీవీ శ్రీనివాస్‌ను పెద్దాపురం సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయాధికారిగా, ఆలమూరు మండలంలో పనిచేస్తున్న కిషోర్‌బాబుకు తాడేపల్లిగూడెం పురుగు మందుల ప్రయోగశాలకు, కపిలేశ్వరపురం మండలంలో పనిచేస్తున్న ఐ. లక్ష్మిని కాకినాడ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయాధికారిగా నియమించారు. శనివారం వారు బాధ్యతలు స్వీకరించారు.

పేదరిక నిర్మూలనకు నిర్దిష్టమైన జీవనోపాధులు

మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్



మాట్లాడుతున్న తేజ్‌భరత్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు నిర్దిష్టమైన జీవనోపాదుల ఏర్పాటు చేయాలని మెప్మా రాష్ట్ర మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అన్నారు. రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో శనివారం జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, మెప్మా సిబ్బందికి సమీక్ష సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలు తీరును ఆయన సమీక్షించారు. సమీక్షలో మెప్మా పీడీ బి.ప్రియంవద, కమిషన్లు, మెప్మా సిబ్బంది, బీటీఈలు, సీఎంఎం, టీఎంసీ, సీవో, డీఈవోలు పాల్గొన్నారు.

అట్టహాసంగా శ్రీవారి శ్రీపుష్పోత్సవం

- శ్రీకృష్ణ అలంకరణలో సూర్యప్రభ వాహనసేవ
- ఆకట్టుకున్న సహస్ర దీపాలంకరణ సేవ
- మోహిని అలంకరణలో చంద్రప్రభ వాహనసేవ
- ఆరోరోజు బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. వేద మంత్రాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వివిధ రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు విద్యుత్, పుష్పాలంకరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. ఆరోరోజు శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వసంత మండపంలో వివిధ రకాల ఫల, పుష్పాలతో అలంకరించగా ఉత్సవమూర్తులు కొలువుదీరి పూజలందుకున్నారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, సప్తకలశారాధన, మహస్నహనపనము, ప్రధాన హోమాలు నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు చేతులు మీదుగా మహా పుష్పయాగం జరిపారు. భక్తులు పుష్పయాగం తిలకించి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం శ్రీకృష్ణ అలంకరణలో శ్రీవారు సూర్యప్రభ వాహనసేవలో విహరించారు. రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు దీపాలంకరణ సేవలో పాల్గొని తన్మయత్వం పొందారు. రాత్రి మోహిని అలంకరణలో శ్రీవారు చంద్రవాహన వాహనంలో ఆశీనులయ్యారు. మిరుగొట్టు గొలిపే బాణసంచాకాల్పులు, విద్యుత్ వెలుగులు, భక్తుల గోవిందనామస్మరణల మధ్య స్వామివారు చంద్రప్రభ వాహనంలో విహరించి భక్తులకు అభయహస్తం అందించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారులు భక్తులను రంజింప చేశాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, ముదునూరి వెంకట్రాజు, సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాథం, మంగాదేవి దంపతులతో పాటు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

నేడు వాడపల్లిలో ...

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం స్వామివారికి హోమములు, లోకకళ్యాణార్థం శ్రీ శ్రీనివాస కళ్యాణం, రాత్రి రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు గజవాహనసేవ నిర్వహిస్తారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొంటారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శన చేయనున్నారు.



ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న పండితులు



స్వామివారి శ్రీ పుష్పోత్సవం జరుపుతున్న వేద పండితులు



బ్రహ్మోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న దృశ్యం



సూర్యప్రభ వాహనసేవలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



సూపరింటెండెంట్ సత్యశ్రీనివాస్‌కు విరాళం అందజేస్తున్న నాగమణి

సత్యదేవ నిత్యాన్నదానం, గోసంరక్షణ ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం

అన్నవరం, అక్టోబరు 26: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకం, గోసంరక్షణ ట్రస్టుకు శనివారం కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన బోసు నాగమణి రూ.2 లక్షలు విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత పీఆర్వో విభాగ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్‌కు అందజేశారు. దాతకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రసాదం ఇచ్చారు.



పాపికొండలు వెళ్లొద్దాం...

దేవీపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల తర్వాత పాపికొండలు విహార యాత్ర శనివారం ప్రారంభమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలోని పోశమ్మగండి వద్ద ఉన్న బోటు పాయింట్ నుంచి కావేరి బోటులో సుమారు 40 మంది పర్యాటకులు వెళ్లారు. ఈ బోటును దేవీపట్నం ఎస్‌ఐ షరీఫ్, తహసీల్దారు రామకృష్ణ పరిశీలించారు.

విచారణ పక్కదారి!

టేకు చెట్లు మాయం వ్యవహారంలో ఫారెస్టు అధికారులను రక్షించేందుకు రంగం సిద్ధం.... ఇందుకూరు అటవీ రేంజ్‌లో బాగోతం

దేవీపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టేకు చెట్లు మాయం కేసులో విచారణ సక్రమంగా జరగకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండల పరిధిలోకి వచ్చే ఇందుకూరు అటవీ రేంజ్‌లో రమణయ్యపేట వద్ద 69 టేకు చెట్లను దొంగలు రాత్రికి రాత్రే తరలించుకుపోయారు. వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.60లక్షలకు పైగా ఉంటుందని ఒక అంచనా. సెప్టెంబరు 28న టేకు చెట్లు మాయమయ్యాయి. టేకు చెట్లను ఎవరు నరికించారు... ఎక్కడికి తరలించారు... ఇందులో అధికారుల పాత్ర ఉందా లేదా అనే కోణంలో విచారణ జరగాల్సి ఉంది. కానీ అధికారులు అసలు విషయాల జోలికి వెళ్లకుండా టేకు చెట్ల మొదళ్లను చూసి మాత్రమే ప్రాథమిక నివేదిక సిద్ధం చేసినట్టు తెలిసింది. గత నెల 30న ఇందుకూరు రేంజ్ అధికారి దుర్గాకుమార్ బదిలీ అయ్యారు. అంతకు రెండు రోజులు ముందుగానే 69కి పైగా టేకు చెట్లను నరికి



రమణయ్యపేటలో టేకు చెట్టును నరికేయగా మిగిలిన మోడు

తరలించుకుపోవడంలో అటవీ శాఖాధికారుల పాత్ర ఉందనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. దీనికి తోడు సెక్షన్ ఇన్‌చార్జి అధికారి, మరో సెక్షన్ అధికారి టేకు చెట్ల దొంగకు సహకరించారనే అనుమానాలు, ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా టేకు చెట్ల విలువ రూ.60లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీని ప్రకారం సదరు సెక్షన్ ఆఫీసర్‌తో పాటు రేంజ్ అధికారిపైనా కఠిన చర్యలు ఉండే అవకాశాలుండడంతో విచారణను నీరుగార్చి టేకుచెట్ల విలువను ఐదారు లక్షలు తక్కువగా విచారణ నివేదికలో పొందుపరిచినట్టు సమాచారం. ఈ వ్యవహారమంతా బదిలీపై వెళ్లిపోయిన రేంజ్ అధికారిని రక్షించేందుకేనని గుసగుసలు వినిపిస్తున్నాయి.

వాస్తవానికి టేకు చెట్లు మాయమైన రెండు రోజుల్లోనే దొంగలను పట్టుకోవాల్సి ఉండగా ఇప్పటివరకు ఆ దిశగా విచారణ జరపలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గొందూరుకు చెందిన ఒక వ్యక్తి (ప్రస్తుతం సీతానగరం) టేకు చెట్లను అధికారుల అండతో తరలించుకుపోయాడని మండలంలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కానీ 60 లక్షల వ్యవహారంపై ఉన్నత స్థాయి అధికారులు విచారణ జరపాల్సి వుంది. అయితే దేవీపట్నం సెక్షన్ అధికారి బాపిరాజును ప్రాథమిక విచారణాధికారిగా నియమించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మంటల్లో చిక్కుకుని వృద్ధురాలి మృతి



పెద్దాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న రాజీవ్ కాలనీలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమైంది. ఓ వృద్ధురాలు మృతి చెందినట్టు ఏడీఎఫ్‌వో ఎం.శ్రీహరి జగన్నాథ్ తెలిపారు. రాజీవ్ కాలనీలో కనకాల సత్తిబాబు, అతడి భార్య బూరమ్మ (75) నివాసముంటున్నారు. ఇంట్లో వంట చేసుకునే సమయంలో ఎగసిపడిన నిప్పురవ్వల కారణంగా మంటలు వ్యాపించాయి. సామాన్లు తీసుకుందామని ప్రయత్నం చేసే సమయంలో బూరమ్మ మంటల్లో చిక్కుకుపోయింది. స్థానికులు అతికష్టం మీద బయటకు తీసుకువచ్చినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.20 వేల ఆస్తి నష్టం సంభవించింది.

మహద్భాగ్యం

ఒకేరోజు ఆరు పుణ్యక్షేత్రాల సందర్శన

టెంపుల్ టూరిజం బస్సును ప్రారంభించిన పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

తొలి యాత్రలో పాల్గొన్న 18 మంది



రాజమహేంద్రవరంలో బస్సు యాత్రను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్. చిత్రంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, బత్తుల, నల్లమిల్లి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 26: పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఆరు పుణ్య క్షేత్రాలను ఒకేరోజు దర్శనం చేసుకునేలా బస్సు ఏర్పాటు చేశారు. శనివారం దానిని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సరస్వతి ఘాట్ సమీపంలోని టూరిజం కార్యాలయం వద్ద మంత్రి కందుల దుర్గేష్ ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టూరిజం బోర్డు సభ్యులు గంటా స్వరూపదేవి, వాసిరెడ్డి రాంబాబు, టూరిజం రీజనల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు జెండా ఊపి ప్రారంభించారు. 20 మంది యాత్రికులతో బస్సు బయల్దేరింది. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటకాన్ని పరుగులు పెట్టించాలన్న ఉద్దేశ్యంతో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఒక రోజు బస్సు యాత్రకు శ్రీకారం చుట్టామన్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి, అన్నవరం సత్యనారాయణ స్వామి, పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి, సామర్లకోట భీమేశ్వరస్వామి, బిక్కవోలు లక్ష్మీగణపతి, కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయాల సందర్శన అనంతరం రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో గోదావరి హారతి తిలకించేలా ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన స్వదేశీ దర్శన్, ప్రసాద్‌లతో పాటు ఎకో అడ్వెంచర్, వెల్‌నెస్, టెంపుల్ టూరిజంలను అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. వీటన్నిటినీ కలిపి టూరిజం సర్క్యూట్లుగా చేసి సత్ఫలితాలు సాధించాలని భావిస్తున్నామన్నారు. రుషికొండ బీచ్ బ్లూఫ్లాగ్ బీచ్‌గా సర్టిఫికెట్ పొందిందన్నారు. దానితో పాటు కాకినాడ, సూర్యలంక, రామాపురం, నెల్లూరు జిల్లా మైపాడు బీచ్‌లు బ్లూ ఫ్లాగ్ బీచ్‌లుగా రూపాంతరం చెందేందుకు కృషి చేస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.



అన్నవరం దేవస్థానంలో...

అన్నవరం: టెంపుల్ టూరిజంలో భాగంగా 18మంది తొలి ప్రయాణం చేశారు. అన్నవరం సత్యదేవుని సన్నిధికి విచ్చేసిన వారికి పీఆర్వో విభాగ అధికారులు బలువు సత్యశ్రీనివాస్, ఎం.గణపతిరావు ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు మాట్లాడుతూ ఒకేరోజు ఆరు పుణ్యక్షేత్రాలను దర్శించడం, చివరిగా గోదావరి హారతిలో పాల్గొనడం ప్రత్యేక అనుభూతి కలిగించిందన్నారు.

పిఠాపురం: టెంపుల్ టూరిజంలో భాగంగా 18మంది భక్తులు పాదగయ క్షేత్రానికి వచ్చారు. వారికి ఆలయ ఈవో, సహాయ కమిషనరు కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది వారికి దర్శనాలు చేయించారు. భక్తులకు వేదపండితులు ఆశీర్వచనాలు పలికారు.





ప్రధాన రహదారిపై బైఠాయించిన ఆందోళనకారులు, దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

ప్రజల ప్రాణాల కంటే పరిశ్రమే ముఖ్యమా!

దీక్షా శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎంపీ హర్షకుమార్

గుమ్మళ్లదొడ్డిలో 5వ రోజుకు నిరవధిక దీక్ష

గోకవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాల కంటే పరిశ్రమ నిర్వహణే ప్రభుత్వానికి ముఖ్యమా అని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ప్రశ్నించారు. అస్సాగో ఇథనాల్ పరిశ్రమను తరలించాలని కోరుతూ తూర్పు గోదావరి జిల్లాగోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమ నేత పాటంశెట్టి సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవి చేపట్టిన నిరవధిక దీక్ష శనివారం ఐదో రోజుకు చేరుకొంది. దీక్షా శిబిరాన్ని హర్షకుమార్ సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులకు తాను అండగా నిలుస్తానన్నారు. కాలుష్య పరిశ్రమల నిర్వహణ కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి వేధిస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం బాధితుల పట్ల సానుకూలంగా వ్యవహరించి కంపెనీని ఇక్కడి నుంచి తరలి వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలుష్యకారకమైన పరిశ్రమను తమ గ్రామం నుంచి తరలించాలని కోరుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చేరే విధంగా స్థానికులు పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. పరిశ్రమ వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను పోస్టు కార్డులో పొందుపరుస్తున్నారు. అనారోగ్యానికి గురిచేసే ఈ పరిశ్రమ మాకొద్దంటూ అధిక సంఖ్యలో బాధితులు రాజమహేంద్రవరం -భద్రాచలం రహదారిపై బైఠాయించారు. దీంతో అటు రెండు కిలో మీటర్లు, ఇటు రెండు కిలో మీటర్లు మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పరిశ్రమ గేటు ఎదుట ఆందోళన చేసేందుకు బయల్దేరిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళన విరమించాలని అదనపు ఎస్పీ సుబ్బరాజు మరోమారు చేసిన ప్రయత్నం ఫలించలేదు. పరిశ్రమను గుమ్మళ్లదొడ్డి నుంచి తరలిస్తామని తమకు సరైన హామీ లభించే వరకు ఆందోళన విరమించేది లేదని ఆందోళనకారులు తేల్చి చెప్పారు.

పోలీసులకు, గ్రామస్తులకు మధ్య తోపులాట

సొమ్మసిల్లి పడిపోయిన మహిళ

కాగా ఇథనాల్ పరిశ్రమ ప్రధాన గేటు ముందు శనివారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.. పరిశ్రమ నిర్వహణను తక్షణమే నిలిపివేయాలంటూ స్థానికులు గేటు ఎదుట ఆందోళనకు దిగారు. పరిశ్రమ నుంచి బయటకు లోపలకు వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం సమాచారం మేరకు భారీస్థాయిలో పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన నిలిపివేయాలని హెచ్చరించారు. అయినప్పటికీ స్థానికులు ససేమిరా అనడంతో ఆందోళనను భగ్నం చేయడానికి ప్రయత్నించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. పోలీసులు.. ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది.ఈ ఘటనలో బావాజీపేటకు చెందిన ఒక మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్టు సమాచారం.. శనివారం రాత్రి 10 గంటల సమయంలో పోలీసులు ఆందోళనకారులను వాహనాలు ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. దీంతో ప్రస్తుతానికి వివాదం సమసింది. నాలుగు రోజులుగా జరుగుతున్న నిరవధిక దీక్షను భగ్నం చేసి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.





ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు, మృతుడు వెంకటరమణ (పాతచిత్రం)

ఆనందం... అంతలోనే విషాదం

- తూర్పు గోనగూడెం సమీపంలో కారును ఢీకొన్న ఐషర్ వ్యాన్... సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి
- రాజమహేంద్రవరంలో వివాహ వేడుకకు వెళ్తుండగా ప్రమాదం

రాజానగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి ఆనందంగా బయల్దేరిన వ్యక్తి అనుకోకుండా జరిగిన ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు చేరుకున్నాడు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం తూర్పుగోనగూడెం సమీపంలో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తొండంగి మండలం వలసపాకలు అగ్రహారానికి చెందిన నట్టే వెంకటరమణ (32) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ వర్క్‌ఫ్రం హోమ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం వివాహ వేడుకలో పాల్గొనేందుకు కారులో రాజమహేంద్రవరం పయనమయ్యాడు. తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల సమీపానికి వచ్చేసరికి హైవే డివైడర్‌లో నుంచి దారిమళ్లుతున్న ఐషర్ వ్యాన్ కారును బలంగా ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా కారు నడుతున్న వెంకటరమణ కారులోనే మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. సమాచారం అందుకున్న రాజానగరం సీఐ ఎస్.ప్రసన్నవీరయ్యగౌడ్, ఎస్‌ఐ మనోహర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మనోహర్ తెలిపారు. ట్రాఫిక్ నిలిచిపోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

గ్రామ అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ

సామర్లకోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రానున్న ఆర్థిక సంవత్సరంలో పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు చెందిన గ్రామాల అభివృద్ధి ప్రణాళికల తయారీపై కాకినాడ జిల్లా సామర్లకోటలోని విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో అధికారులకు రెండు రోజుల శిక్షణ తరగుతులు శనివారం ముగిసాయి. అనకాపల్లి, విశాఖపట్నం, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, పాడేరు జిల్లాలకు చెందిన ఎంపీ డీవోలు, ఈవోపీఆర్డీలు 120 మంది హాజరయ్యారు. ముఖ్య అతిథి, విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు ఎంతగానో దోహదపడతాయన్నారు. శిక్షణ అనంతరం అధికారులకు సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ అందజేశారు. ఫ్యాకల్టీలుగా జి.రమణ, కె.శ్రీనివాసరావు, ఆంజనేయులు, ప్రసాద్, నిహారిక వ్యవహరించారు. ఈ నెల 28, 29 తేదీలో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, డాక్టర్ కోనసీమ అంబేడ్కర్, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన అధికారులు హాజరవుతారని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ చెప్పారు.

ఉసురు తీసిన వివాహేతర సంబంధం

పట్టుకునేందుకు ప్రయత్నించగా తోసి పరారైన ప్రియుడు

తలకు బలమైన గాయంతో మధుబాబు మృతి...

నిందితులు రిమాండ్‌కు తరలింపు

తొండంగి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీ నగరంలో సంచలనం రేకెత్తించిన బత్తిన మధుబాబు అనుమానాస్పద మృతి కేసులో అనుమానితులుగా ఉన్న మధు భార్య శిరీష, ఆమె ప్రియుడు పీతల ప్రశాంత్‌కుమార్‌లకు శనివారం తుని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు రిమాండ్ విధించిందని తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. శిరీష, ప్రశాంత్‌కుమార్ మధ్య ఉన్న వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ నెల 18న మధుబాబు ఇంటికి ప్రశాంత్‌కుమార్ వెళ్లాడు. అప్పటికే అనారోగ్యంతో ఉన్న మధు గమనించి ఇద్దరినీ పట్టుకునే ప్రయత్నం చేయగా మధును ప్రశాంతకుమార్ తోసివేసి పరారయ్యే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మధుబాబు తలకు బలమైన గాయమై మృతి చెందగా బంధువులు సహజ మరణంగా భావించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నెల 24న శిరీష ఇంటికి ప్రశాంత్‌కుమార్ రాగా వారిద్దరినీ పట్టుకున్న బంధువులు, గ్రామస్తులు మధుబాబు మృతికి వారే కారణమని ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేశామని ఎస్‌ఐ తెలిపారు. పూడ్చిపెట్టిన మృతదేహానికి శవ పంచనామా చేయించామన్నారు. ప్రాథమికంగా మధుబాబు తలకు బలమైన గాయమైనట్టు తెలిసిందన్నారు. కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా శిరీష, ప్రశాంత్‌కుమార్‌లకు రిమాండ్ విధించినట్టు జగన్మోహన్ చెప్పారు.

ధ్యానంతో మనసుకు ప్రశాంతత

- శ్రీఅరబిందో సొసైటీ ఉభయ తెలుగు రాష్ట్రాల చైర్మన్ శ్రీనివాస్ ములుగు



రాజానగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ కనీసం ఐదు నిమిషాలు దీర్ఘ శ్వాస, ధ్యానం చేయడం ద్వారా మనసుకు ప్రశాంత పొందచ్చని, ఆలోచనలను నియంత్రించవచ్చని శ్రీఅరబిందో సొసైటీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల చైర్మన్ శ్రీనివాస్ ములుగు పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలోని గైట్ అటానమస్ కళాశాలలో 'అంతర్గత సామరస్యం-సాధన' అంశంపై శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అంతర్గత సామరస్యం, శరీరం, మనస్సు, భావోద్వేగాల స్థిరీకరణ ద్వారా సాధ్యమని విద్యార్థులకు వివరించారు. ఒక వ్యక్తికి సాధారణంగా రోజుకు 65 వేల నుంచి 75 వేలు వరకు ఆలోచనలు వచ్చే అవకాశం ఉందని, అయితే మనసు ఏకాగ్రతతో కేవలం 8 సెకన్ల పాటు మాత్రమే ఒక అంశంపై కేంద్రీకరించగలదని చెప్పారు.

సాధారణ శారీరక వ్యాయామం మనసుకు స్థిరత్వాన్ని అందిస్తుందని, ఆచరణలో ఉన్న మనస్సు నెగిటివ్ ఆలోచనలకు లోనుకాకుండా ఉంటుందన్నారు. భావోద్వేగ నియంత్రణ సమతుల్య జీవితానికి పునాది అని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ధ్యానం సాధన వ్యక్తిగత జీవితంలో గొప్ప మార్పు తీసుకొస్తుందన్నారు. మన ఆహారం మనసును ప్రభావితం చేస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఆహారాన్ని ఎంపిక చేసుకోవడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొబైల్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథిని జీజీయా తరఫున దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ టి.జయానంద కుమార్, డైరెక్టర్లు టీవీ ప్రసాద్, ఆర్ఎస్ రాజు, అసోసియేట్ ప్రొఫెసర్ కేదార్నాథ్ మహాపాత్ర, మైనింగ్ విభాగం అధిపతి వినోద్, విద్యార్థులు, వరంగల్, యానాం, తెనాలి, తిరుపతి, రాజమహేంద్రవం ప్రాంతాల నుంచి అరబిందో సొసైటీ శాఖల అధిపతులు పాల్గొన్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడు

మోతుగూడెం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం ఎస్‌ఐ శివనారాయణకు వచ్చిన సమాచారం మేరకు మోతుగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రంలోని తపతొట్టి గ్రామం నుంచి ఖమ్మం జిల్లాకు అక్రమంగా తరలిస్తున్న 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మయిన్‌గొల్లారి, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా నిమల్‌పాలేనికి చెందిన మయిన్ గొల్లారి, చింతూరు మండలానికి చెందిన కిలో దేబో లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పల్సర్ మోటార్ సైకిలు, రెండు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.1.10లక్షలు ఉంటుంది. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం, కానిస్టేబుల్ ఎస్ఆర్‌కే రాజు, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

శృంగారవల్లభస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తొలి తిరుపతికి శనివారం భక్తులు పోటెత్తారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శృంగారవల్లభ స్వామి దర్శనానికి భక్తులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,48,350 అన్నదాన విరాళాలు రూ.52,803, కేశఖండన ద్వారా రూ.6,120, తులాభారం ద్వారా రూ.450, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.24,630... మొత్తం రూ.2,32,353 ఆదాయం వచ్చిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఉచిత వైద్యశిబిరం

కరప, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీహెచ్ నర్సింగ్ హోమ్‌లో శనివారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. వివిధ సమస్యలతో బాధపడుతున్న 200మంది రాగా వారికి డాక్టర్ డేగల రాజేష్, డాక్టర్ కె.వెంకటలక్ష్మి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. పీఏసీ ఎస్ మాజీ అధ్యక్షుడు నక్కా వీరభద్రరావు, నక్కా శ్రీను (బుజ్జి) తదితరులున్నారు.

కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు
పలుచోట్ల టీడీపీ సభ్యత్వ నమోదు

కాకినాడ సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుందని, ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడమే టీడీపీ సభ్యత్వ నమోదు లక్ష్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక 6వ డివిజన్ రేచెర్లపేట, 30వ డివిజన్ గోల్డ్ మార్కెట్ సెంటర్ ఏరియాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీకి ఎప్పుడూ కార్యకర్తలే బలమన్నారు. ఏదైనా ప్రమాదంలో మరణించినప్పుడు ఆదుకోవడానికి సభ్యత్వ నమోదు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. పార్టీ సభ్యత్వాన్ని వాట్సాప్, టీడీపీ యాప్, టెలిగ్రామ్ ద్వారా రూ.100 చెల్లించి పొందవచ్చన్నారు. ప్రతి కార్యకర్త సభ్యత్వం చేయించుకోవాలని, ఇప్పటికే ఉన్నవారు పునరుద్ధరించుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, గ్రంధి బాబ్జి, బచ్చు శేఖర్, పోలిపల్లి జగన్, గదుల సాయిబాబు, ఏంఏ తాజుద్దీన్, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, గుత్తుల రమణ, అంబటి చిన్న, అమన్ జైన్, బొబ్బిలి గోవిందు, దంగేటి సతీష్, బుంగా నాగరాజు, గంజి గోపి, అద్దేపల్లి గంగరాజు, ఎండీ అన్సర్, రెడ్నం సత్తిబాబు అమలకంటి బలరామ్, కొల్లు కుమారి, బత్తిన ఉమాదేవి పాల్గొన్నారు. వసంతాల టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా కొనసాగుతోందని టీడీపీ జిల్లా మీడియా కోఆర్డినేటర్ వుండవల్లి వీర్రాజు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం పండుగ వాతావరణలా ఉందన్నారు. నమోదును మొబైల్ ఫోన్, కంప్యూటర్ నుంచి వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా వెబ్‌సైట్ ద్వారా చేసుకోవచ్చ ని, పాత సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవచ్చన్నారు.


సెల్‌ఫోన్‌లో సభ్యత్వం చూపుతున్న కొండబాబు


పిఠాపురం బంగారమ్మ రావిచెట్టు సెంటర్‌లో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న నాయకులు


తాళ్లరేవు మండలం కోరింగలో టీడీపీ సభ్యత్వాలను ప్రారంభిస్తున్న నేతలు

టీడీపీ సభ్యత్వంతో భరోసా

టీడీపీ సభ్యత్వంతో ప్రతీ కార్యకర్త కుటుంబానికి భరోసా లభిస్తుందని మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు, కాకినాడ రూరల్ ఎన్నికల సమన్వయకర్త నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నులుకుర్తి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. చిక్కాల, నులుకుర్తి మాట్లాడుతూ రూ.100 సభ్యత్వ రుసుంతో కార్యకర్తతోపాటు వారి కుటుంబానికి భరోసా భద్రత ఉంటుందన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్, డివిజన్ స్థాయిలో సభ్యత్వ నమోదును అత్యధికంగా చేపట్టాలన్నారు. పార్టీలో పదవుల కేటాయింపు, ఇతర అంశాల్లో ప్రాధాన్యం ఉండాలంటే సభ్యత్వం తప్పనిసరన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవు వెంకటేశ్వరరావు, మాసుమేను గంగయ్య, దమ్ము నూకరాజు, కోణాల కృష్ణ, ముగ్గళ్ల బాబూరావు, కొండా వినాయక్, మల్లంపల్లి నారాయణ, డి.సత్తిబాబు ఉన్నారు.

నారా లోకేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరాంవర్మ, మండపాక వీరవెంకట సత్యనారాయణ, బత్తుల సూర్యప్రసాద్ పాల్గొన్నారు. తొలుత దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలామాల వేసి నివాళులర్పించారు. అనంతరం జనార్దన్ క్యారేజీ ద్వారా పేదలకు భోజన వసతి కల్పించారు.

సర్పవరం జంక్షన్: పార్టీ కార్యకర్తల సంక్షేమం, కుటుంబ సభ్యుల భద్రతకు పెద్దపీట వేసిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని, కార్యకర్తలను కుటుంబ సభ్యుల్లాగా సీఎం చంద్రబాబు చూసుకుంటున్నారని ఆపార్టీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, నియోజకవర్గం కో కోర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) పేర్కొన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం రమణయ్యపేట గైగోలుపాడులో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, 2వ డివిజన్ వైద్యనగర్ రోడ్డులో వినాయకుని గుడి వద్ద టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, కరణంగారి సెంటర్‌లో కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమం లో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. వారు మాట్లాడుతూ రూ.100లు సభ్యత్వం స్వీకరించిన కార్యకర్తలకు రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూందన్నారు. నిరుపేదల పిల్లలను టీడీపీ ట్రస్ట్ ద్వారా ఉచిత విద్య అందిస్తూందన్నారు. పార్టీ నాయకులు 2వ డివిజన్ ఇన్‌చార్జి మునస బాబూరావు, మాజీ డిప్యూటీ మేయర్ కాళ్ల సత్తిబాబు, సీతయ్యదొర, మట్టా ప్రకాశ్‌గౌడ్, ఏటుకూరి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: పట్టణంలోని బంగారమ్మ రావి చెట్టు సెంటర్‌లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభమైంది. 14వ వార్డులో టీడీపీ ఇంటింటా తిరిగి టీడీపీ సభ్యత్వాలను చేయించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లుమల్లు విజయకుమార్, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు నల్లా శ్రీనివాస్, టీడీపీ నేతలు పిల్లి చిన్నా, అల్లవరపు నగేష్, అనిశెట్టి సత్యానందరెడ్డి, గుండ్ర సుబ్బారావు, బస్సా సత్యనారాయణ, అంకంరెడ్డి వినయ్ తదితరులున్నారు.

తాళ్లరేవు: పార్టీ కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వంతో బీమా భోరోసా ఇస్తుందని టీడీపీ సీనియర్‌నేత టేకుమూడి లక్ష్మణరావు అన్నారు. కోరంగ వేణుగోపాలస్వామిగుడిలో పూజలు చేసి పార్టీ సభ్యత్వాలు ప్రారంభించారు. కార్యకర్తలకు ప్రమాదం జరిగినా, మరణం సంభవించిన ఇన్సూరెన్స్ బీమా ఉంటుందని టీడీపీనేత దాట్ల పృథ్వీ చెప్పారు. టీడీపీ నేతలు మందాల గంగసూర్యనారాయణ, నడింపల్లి వినోద్, ధూళిపూడి వెంకటరమణ, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, కొప్పిశెట్టి బాబి, టేకుమూడి సత్యనారాయణ, జక్కల ప్రసాద్, కొప్పిశెట్టి చంటి, భైరవమూర్తి ఉన్నారు.

పైపులైన్ పగిలి.. ఫౌంటేన్‌లా ఎగసి!



కరప, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కరప ప్రధానరహదారి పక్కన శనివారం ఉదయం ప్రధాన పైపులైను పగిలి తాగునీరు భారీగా వృధా అయ్యింది. దీంతో భారీస్థాయిలో తాగునీరు పైకి ఎగసి రోడ్డుపై పడింది. సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్, కార్యదర్శి యు. నిర్మలాదేవి నీటి సరఫరాను నిలిపివేయించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు.

ఐటీఐలో స్నాతకోత్సవం

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఐటీఐలో కౌశల్ దీక్షాంత్ సమరోహ్(స్నాతకోత్సవం) వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కాకినాడ ప్రభుత్వ ఐటీఐలోను 2024లో పాస్ అయిన విద్యార్థులకు స్నాతకోత్సవం నిర్వహించారు. దీనికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి ట్రేడులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్ అందించి అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ, ప్రముఖ పారిశ్రామికవేత్త ఐఎంసీ చైర్మన్ కాకర్ల రామకృష్ణ, రీజనల్ ఆఫీస్ కార్యనిర్వాహణాధికారి మంగతాయారు ఉన్నారు.

బాణసంచా సామగ్రి సీజ్

కరప, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్రిపూడిలో శనివారం సాయంత్రం పోలీసులు దాడిచేసి అక్రమ బాణసంచా సామాగ్రిని సీజ్‌చేశారు. కరప ఎస్ఐ తోట సునీత, అదనపు ఎస్ఐ ఆర్‌వీఎస్ మూర్తి సిబ్బందితో కలిసి తయారీకేంద్రంపై దాడిచేశారు. రూ.11,700 విలువచేసే 2,600ల చిచ్చుబుడ్లు, 20కేజీల బొగ్గు, 2 కిలోల తినే సోడా, ఇతర సామాగ్రిని సీజ్‌చేసి గండి దుర్గాప్రసాద్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

'నిబంధనలు పాటించాలి'

తాళ్లరేవు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా బాణసంచా తాత్కాలిక షాపుల నిర్వాహకులు బహిరంగ స్థలాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించాలని తహశీల్దార్ పి.త్రినాధరావు ఆదేశించారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో షాపుల నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాళ్లరేవు, నీలపల్లి, సుంకరపాలెంలో 72మంది షాపులకు అనుమతులు ఉన్నాయని తెలిపారు. షాపుల మధ్య దూరం ఉండాలని, షాపుల షెడ్లు విడివిడిగా ఉండాలన్నారు. డీటీ ఎమ్.సూరిబాబు, ఆర్ఐ రామకృష్ణ, సర్వేయర్ మహ్మద్‌షఫీ, రీసర్వే డీటీ వీరబాబు, ఎడీఎఫ్ యేసుబాబు, ఏఈ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

లారీని ఢీకొని గాయాలు

తాళ్లరేవు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు 216 జాతీయరహదారిపై లోడు లారీని ద్విచక్రవాహనం ఢీకొనడంతో వ్యక్తి గాయాలపాలైనట్టు కోరంగ ఎస్ఐ పి.సత్యనారాయణ శనివారం తెలిపారు. పెద్దాపురానికి చెందిన బుర్రా అనిల్, మేకా రాజేష్ ద్విచక్రవాహనంపై యానాం వెళ్లి తిరిగివస్తున్న సమయంలో సూర్య హాస్పటల్ వద్ద ఐస్‌ఫ్యాక్టరీ నుంచి రోడ్డుఎక్కుతున్న లోడు లారీని ఢీకొన్నారు. అనిల్ కు గాయాలు కాగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజేష్ చిన్నగాయాలతో బయటపడ్డాడు. కోరింగ ఎస్ఐ కేసు నమోదు చేశారు.

రీసర్వేపై ఫిర్యాదుల వెల్లువ

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వన్నెపూడిలో శనివారం నిర్వహించిన గ్రామసభలో రీసర్వేపై ఫిర్యాదులు వెలువెత్తాయి. రీసర్వేలో జాయింట్ ఎల్‌పీఎంలపై 29, విస్తీర్ణంలో తేడాలపై 78, మ్యుటేషన్స్‌పై 18 దరఖాస్తులు అందాయి. మొత్తం 125 పిటిషన్లు వచ్చినట్టు తహశీల్దారు సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దారు మస్తానీ తెలిపారు.



పార్కులతో ప్రజలకు ఆహ్లాదం

ఎమ్మెల్యే పంతం నానాజీ


నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

సర్పవరం జంక్షన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో శారీరక, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొంది, ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. శనివారం వాకలపూడిలో వినాయక రామకృష్ణనగర్‌లో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు రూ.50 లక్షల సీఎస్ఆర్ నిధులతో 2.40 ఎకరాల్లో నిర్మిస్తున్న పార్కు అభివృద్ధి, ప్రహరీ, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను ఆ సంస్థ ఏవీపీ హెచ్ఆర్ జీఎస్‌వీ రాజా, యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు, జీఎం హెచ్ఆర్ పద్మనాభంతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ పార్కు కావాలన్న ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కోరమండల్ సహకారంతో అన్ని సౌకర్యాలతో కూడిన పార్కు నిర్మించడం జరుగుతుందన్నారు. వాకలపూడి పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యమైన వైద్య సేవలు, తాగునీటి సరఫరా తదితన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్న కోరమండల్ సేవలు అభినందనీయమన్నారు. నిరుద్యోగ యువతకు శిక్షణ కోసం ప్రభుత్వం స్థలం కేటాయిస్తే స్కిల్ డవలెప్‌మెంట్ భవనం నిర్మించి, శిక్షణ ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్థానికంగా ఉన్న మెయిన్‌రోడ్డు పక్కన 7 సెంట్ల స్థలాన్ని కేటాయిస్తూ కలెక్టర్ షాన్ మోహన్ ఉత్తర్వులివ్వడం జరిగిందన్నారు. ప్రజలు, నిరుద్యోగ యువత తరపున కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ జారీ చేసిన స్థలం కేటాయింపు ఉత్తర్వులను పంచాయతీ కార్యదర్శి పి పాండురంగారావు చేతుల మీదుగా కోరమండల్ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో కోరమండల్ ఏసీఎం సీఎస్ఆర్ జయగోపాల్, హెచ్ఆర్ వంశీ, కూటమి నాయకులు సలాది శ్రీనివాసు బాబు, గంటా ప్రసాద్, చొక్కా జగన్, మాతా లక్ష్మణ్, కరెడ్ల గోవిందు పాల్గొన్నారు. టాయించిన స్థలాన్ని అధికారులతో పరిశీలించారు.

'కల్తీ నెయ్యి మాఫియాపై చర్యలు తీసుకోవాలి'

పిఠాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జంతువుల కొవ్వులతో కల్తీ నెయ్యి తయారు చేసి దానిని దీపారాధనకు వినియోగానికి విక్రయించడంపై భజరంగదళ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పిఠాపురంలో శనివారం భజరంగదళ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సురేంద్రదత్త మాట్లాడుతూ కల్తీ నెయ్యి మాఫియాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిఠాపురంలో 300కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకుని, తయారీదారులను ప్రశ్నించగా వాటిని దీపారాధనకు వినియోగిస్తున్నట్లు చెప్పడం దారుణమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ విజిలెన్స్ అధికారులతో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల వద్ద గల దుకాణాలు, పూజా సామాగ్రి వినియోగించే షాపులపై విచారణ జరిపించాలని కోరారు. భజరంగదళ్, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

సుద్దగడ్డ కాలువలో పడి వ్యక్తి గల్లంతు


గాలిస్తున్న పోలీసులు, స్థానికులు

గొల్లప్రోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో సుద్దగడ్డ కాలువలో పడి శనివారం రాత్రి వ్యక్తి గల్లంతయ్యాడు. పట్టణంలోని జగనన్న కాలనీకి చెందిన యిందన లోవరాజు(45) కారంమిల్లులో రోజువారి కూలీగా పని చేస్తున్నాడు. మిల్లులో పని ముగించుకుని శనివారం రాత్రి 9గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తున్నాడు. జగనన్న కాలనీకి వెళ్లే రహదారిలో నడుస్తూ వెళ్తూ డౌన్ కల్వర్టు వద్ద ప్రమాదావాశాత్తు సుద్దగడ్డ కాలువలో పడిపోయి గల్లంతయ్యాడు. అదేమార్గంలో వెళ్తున్న శివమాల ధరించి వ్యక్తి వెంటనే కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న గొల్లప్రోలు ఎస్ఐ ఎస్.రామకృష్ణ, పోలీసులు, స్థానికులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. టార్చ్‌లైట్ల వెలుగులో గాలింపు కొనసాగుతోంది. లోవరాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గజ ఈతగాళ్లను రప్పించే ప్రయత్నం చేస్తున్నారు.

ఏరోబిక్స్ చాంపియన్‌షిప్‌లో కాకినాడ విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

సర్పవరం జంక్షన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఏరోబిక్స్ చాంపియన్‌షిప్ -2024లో కాకినాడ విద్యార్థులు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఆశ్రమం స్కూల్‌కు చెందిన మడికి అఖిల్ రాజ్ అండర్ -14 విభాగంలో, లిటిల్ ఉడ్స్ స్కూల్‌కి చెందిన గాదె మనన్ అండర్ -11 విభాగంలో ఏరోబిక్స్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తాచాటి ఇద్దరు వ్యక్తిగతంగా బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఇద్దరు విద్యార్థులను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తన కార్యాలయానికి పిలిపించుకుని ఘనంగా సత్కరించి అభినందించారు. విద్యతో పాటూ జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకే గర్వకారణంగా నిలిచారని ఎమ్మెల్యే నానాజీ అభినందించారు. వీరికి కోచింగ్ ఇచ్చిన కోచ్ కొమ్మినీడి సురేష్‌ను అభినందించారు.

వ్యాపార రంగంలో సృజనాత్మకత అవసరం

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ మునిరాజ్ మయూర్


విద్యార్థులతో మాట్లాడుతున్న మునిరాజ్ మయూర్

పెద్దాపురం అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యాపార రంగంలో సృజనాత్మకత ఎంతో అవవసరమని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ మునిరాజ్ మయూర్, సరళ ఫుడ్స్ వ్యవస్థాపక డైరెక్టర్ హనీ అగర్వాల్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో దిశ 2024 పేరుతో నిర్వహించే కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా శనివారం హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ దిశ కార్యక్రమం విద్యార్థుల దశ దిశ నిర్ధారించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వ్యాపార రంగంలోకి ప్రవేశించాలనుకునేవారికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ విద్యార్థి మానసిన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రొఫెసర్ సంతా నం మాట్లాడుతూ కామర్స్ మేనేజ్‌మెంట్‌కు చెందిన విద్యార్థులు జీవితంలో ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ దిశ కార్యక్రమం తమ పాఠశాల విద్యార్థులతోనే నిర్వహించడం జరుగుతుందని తద్వారా వారికి ఆదాయ, వ్యయాల విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలుగుతుందన్నారు. పాఠశాలలో కామర్స్ చదువుతున్న విద్యార్థులకు 6 విభాగాల్లో పోటీలను నిర్వహించి నగదు బహుమతులను అందిస్తామన్నారు. కార్యక్రమానికి తుని, పాయకరావుపేట, విశాఖపట్టణం, కాకినాడ, రాజ మహేంద్రవరం, అమలాపురం, విజయవాడ నుంచి విద్యార్థులు హాజరవ్వగా ముఖ్య అతి థులు ప్రశంశాపత్రాలను అందచేశారు. పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీయస్ మూర్తి, అకడమిక్ కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

'పోలీసు శాఖపై అవగాహన ఉండాలి'

సర్పవరం జంక్షన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ అంతర్గత రక్షణ, భద్రత, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ కోసం అనునిత్యం శ్రమించే పోలీసు శాఖపై విద్యార్థి దశ నుంచే అవగాహన చేసుకోవాలని ఏపీఎస్పీ మూడో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ఎస్ దేవానందరావు కోరారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం రమణయ్యపేట ఏపీఎస్పీలో హెచ్‌ఏసీ కమాండెంట్ రామకృష్ణ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఆపద, విపత్కర పరిస్థితుల్లో ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది అందిస్తున్న సేవలు, ఆయుధాల వినియోగం, పోలీసుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించి ప్రదర్శించారు. పోలీసులు వినియోగించే పలు ఆయుధాలను విద్యార్థులు పరీక్షించారు. ఏపీఎస్పీ హైస్కూల్, ఇంగ్లీషు మీడియం, మోహన్ స్కూల్స్‌కు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ మురళీకుమార్, ఆర్ఐలు బి రామకృష్ణ, విఠలేశ్వరరావు, రవిశంకర్, రాము, శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'రీ సర్వే సభలతో భూ సమస్యలకు పరిష్కారం'

సామర్లకోట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం భూముల రీసర్వేపై నిర్వహిస్తున్న రీసర్వే గ్రామ సభలతో వివాద భూములకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. మండలంలో మాధవపట్నం గ్రామానికి సంబంధించి రీసర్వే గ్రామ సభ ఉండూరు రెండవ సచివాలయంలో శనివారం నిర్వహించారు. తహశీల్దార్ రైతుల 21 అర్జీలను రైతుల నుంచి స్వీకరించారు. డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్, పీ.సీతారామాచార్యులు, ఎం.రమేష్ పాల్గొన్నారు.

ఎల్‌సీఐఎఫ్ కాన్‌క్లేవ్ సెమినార్

కాకినాడ సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌నగర్‌లోని చల్లా ఫంక్షన్‌హాల్‌లో శనివారం లయన్స్ క్లబ్ సంకల్ప్ ఆధ్వర్యంలో ఎల్‌సీఐఎఫ్ కాన్‌క్లేవ్-2024 సెమినార్ జరిగింది. సదస్సుకు లయన్స్ డిస్ట్రిక్ట్ ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ మెట్టా రాధ స్వాగతం పలికారు. లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇవీవీ ఈశ్వర్‌కుమార్ అధ్యక్షత వహించగా లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్, ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ డాక్టర్ అంబటి సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాస్ట్ గవర్నర్ డాక్టర్ గోపాలరావు విశిష్టఅతిథిగా, పాస్ట్ గవర్నర్ అడ్వయిజర్ డాక్టర్ బాదం బాలకృష్ణ గౌరవ అతిథిగా విచ్చేశారు. లయన్స్‌క్లబ్ సంకల్ప్ అధ్యక్షురాలు లక్ష్మీలావణ్య, పాస్ట్ గవర్నర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి సీసీరోడ్డు
పవన్ ఆదేశాలతో నిధుల మంజూరు



గొల్లప్రోలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో రోగులు పడుతున్న ఇక్కట్లు తీరాయి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు సీసీ రోడ్డు నిర్మించారు. గొల్లప్రోలు మండలపరిషత్ కార్యాలయం చెంతనే ఉన్న పీహెచ్‌సీకి వెళ్లే మార్గం అధ్వానంగా ఉంది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోగులతో పాటు వైద్యులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇటీవల గొల్లప్రోలులో పర్యటించిన డిప్యూటీ సీఎం కార్యాలయ ఓఎస్‌డీ మధుసూదన్, ఇతర అధికారుల దృష్టికి ఈ సమస్య వచ్చింది. దీంతో పవన్‌కల్యాణ్ జిల్లా కలెక్టరు షాన్‌మోహన్ మండలపరిషత్ నుంచి నిధులు మంజూరు చేయాలని ఆదేశించగా రూ.4లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి శనివారం పూర్తి చేశారు. సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టిన పవన్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

24న కాపు వనసమారాధన

పిఠాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గ కాపు కార్తీక వనసమారాధను నవంబరు 24న నిర్వహించాలని కాపు ఐక్యవేదిక సమావేశం నిర్ణయించింది. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఏటా మాదిరిగా వనసమారాధనను రాజకీయాలకతీతంగా నిర్వహించాలని ప్రతినిధులు సూచించారు. పట్టణంలోని మాధవపురం రోడ్డులో గల రావుల వెంకటరమణ తోటలో వనసమారాధన జరుగుతుందని చెప్పారు. నియోజకవర్గ కాపు ఐక్యవేదిక అధ్యక్షుడు బుర్రా అనుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బొజ్జా మాణిక్యాలరావు, జవ్వాది కృష్ణమాధవరావు, కొండేపూడి శంకరరావు, దేవరపల్లి చినబాబు పాల్గొన్నారు.

ముగిసిన టెక్ ఫెస్టివల్

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ టెక్ ఫెస్టివల్ సాధన 2కె24 ముగిసింది. విద్యార్థుల ప్రాజెక్టుల్లో విజేతలకు ఐబీఎం సంస్థ ప్రతినిధి దుగ్గిరాల భరత్ బహుమతులు అందజేశారు. స్మార్ట్ బ్రిడ్జి ప్రతినిధి యుక్తేష్, కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు, సెక్రటరీ అనూరాధ పాల్గొన్నారు.



'రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి'

గండేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రోడ్ల నిర్మాణంలో అధికారులు నాణ్యత పాటించాలని జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్వేత అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలో మురారి గుబ్బాలమ్మ గుడి నుంచి హైస్కూల్ వరకు సుమారు రూ.1.50కోట్లతో మంజూరైన రోడ్డు, డ్రైనేజీలకు సంబంధించి పనులను ఆమె శనివారం పరిశీలించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



రాజవొమ్మంగిలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభ సభలో మాట్లాడుతున్న శిరీషదేవి

కార్యకర్తల కష్టంతోనే అధికారంలోకి వచ్చాం

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీషదేవి

రాజవొమ్మంగి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల కష్టంతోనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి పేర్కొన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు అధ్యక్షతన శనివారం జరిగిన జరిగిన టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభ్యత్వం పొందిన వారికి కార్డులు వెంటనే అందేలా ఏర్పాట్లు చేశామన్నారు. టీడీపీ అరకు పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు దంతులూరి శివరామచంద్ర రాజు, రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో



చింతూరులో...

సభ్యత్వ నమోదును ఆ పార్టీ మండల శాఖ ఇళ్ల చిన్నారెడ్డి ప్రారంభించారు. తెలుగు యువత మండల శాఖ అధ్యక్షుడు గెడ్డం సురేష్‌కుమార్, సీనియర్ నాయకుడు ఆకోజు నూకాచారి, మండల ఉపాధ్యక్షుడు వాస శ్రీరాంరెడ్డి, ఐ-టీడీపీ మండల కో-ఆర్డినేటర్ వినోద్, బంధంరాజు, రమణారెడ్డి, ప్రసంగి, సయ్యద్ అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.





నెల్లిపాక, ఎటపాకల్లో సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

అట్టహాసంగా టీడీపీ సభ్యత్వ నమోదు

ఎటపాక, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎటపాక, నెల్లిపాక గ్రామాల్లో తొలిరోజు 76 సభ్యత్వాలు నమోదు చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు కిలారి వెంకన్న, అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్వా శ్రీనివాస్, నలజాల శ్రీకాంత్‌చౌదరి, మాజీ వైస్ ఎంపీపీ రావి మాధవరావు, మండల శాఖ అధ్యక్షుడు పుట్టి రమేష్, గొమ్ముకొత్తగూడెం ఎంపీటీసీ పాయం దేవి, దొంతు మంగేశ్వరరావు, పాటి చలపతి, ఐటీడీపీ మండల కన్వీనర్ బాచినేని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ పురం: రేఖపల్లిలోని టీడీపీ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు ఆచంటి శ్రీను, కార్యదర్శి బురక కన్నారావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. తెలుగు మహిళ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, మండల కోశాధికారి పెందుర్తి సుదర్శన్, ఎంపీటీసీ వాళ్ల వెంకటేశ్వరరెడ్డి, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బీరక సూర్యప్రకాష్‌రావు, కోట్ల బాలయ్య, రంగాచారి పాల్గొన్నారు. వడ్డిగూడెంలో సభ్యత్వ నమోదును తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొర్ర నరేష్‌కుమార్, సీనియర్ నాయకులు బొర్ర నరసింహారావు, ముత్యాల సిద్ధు, బొర్ర ఆదినారాయణ ప్రారంభించారు.

మోతుగూడెం: వై.రామవరం మండలం డొంకరాయిలో టీడీపీ సభ్యత్వ నమోదును ఎంపీటీసీ కరకా వెంకటరమణ సారథ్యంలో అట్టహాసంగా నిర్వహించారు.



వీఆర్ పురం మండలం రేఖపల్లిలో....



వై.రామవరం మండలం డొంకరాయిలో...

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జోగారావు

కూనవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో 17 ఏళ్లుగా పని చేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ ఎంప్లాయీస్ మెడికల్-హెల్త్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుష్టి జోగారావు కోరారు. జిల్లా మేనేజర్లు, ఆఫీసు అసోసియేట్లు, జిల్లా మోనటరింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు అందట్లేదన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు దారా సర్వేశ్వరరావు, సుహాసిని పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ

తుని ఎమ్మెల్యే యనమల దివ్య, పలుచోట్ల టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు



తుని మండలం తేటగుంటలో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివ్య



జగ్గంపేట: తంటికొండ సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్‌కుమార్

తుని రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కష్టపడే కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. తుని పట్టణంతో పాటు రూరల్‌లో తేటగుంట గ్రామంలో శనివారం ఆమె టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యత్వ పొందిన ప్రతీ కార్యకర్తకు పార్టీ రూ.2లక్షలు బీమా సౌకర్యం కల్పిస్తుందని, ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చేరితే రూ.40వేలు ఇవ్వడమే కాకుండా వైద్య ఖర్చులపై రాయితీలు, మరెన్నో సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, యినిగంటి సత్యనారాయణ, గంట్లచిట్టిబాబు, గజ్జి అప్పలరాజు పాల్గొన్నారు.

కోటనందూరు: టీడీపీ సభ్యత్వ నమోదులో తుని నియోజకవర్గం అగ్రగామిగా ఉండేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. బొద్దవరం గ్రామంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దివ్య మాట్లాడారు. కార్యక్రమంలో యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, డి.చిరంజీవిరాజు, పెంటకోట భాస్కరసత్యనారాయణ, గుడివాడ అప్పలనాయుడు మాష్టారు, వెలగా వెంకటకృష్ణారావు, పోతల సూరిబాబు, గెడ్డం కొండయ్యనాయుడు, వేగి గోపి, షేక్ నవాబ్‌జానీ, యర్ర చినసత్యనారాయన, లోవ దేవస్థానం చైర్మెన్ గొర్లిఅచ్చియ్యనాయుడు ఉన్నారు. గ్రామంలో హైస్కూల్‌ను దివ్య తనిఖీ చేశారు.

తొండంగి: టీడీపీకి బలం, బలగం కార్యకర్తలేనని వారి అండదండలతోనే దశాబ్దాల కాలంగా పార్టీ విజయవంతంగా కొనసాగుతోందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. పి.అగ్రహారం గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, పార్టీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు కొయ్యా రామకేశవ, పార్టీమండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, తెలుగు యువత మండలాధ్యక్షులు బంటుపల్లి అన్వేష్, బెక్కం రాధాకృష్ణ ఉన్నారు.

టీడీపీ సభ్యత్వం తీసుకోండి

జగ్గంపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని తద్వారా కుటుంబానికి అండ ఉంటుందని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. గోకవరం మండలంలో తంటికొండ, గాదేలపాలెం, ఇటుకాయలపల్లి, కృష్ణునిపాలెం గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. తంటికొండ గౌరీదేవి ఫంక్షన్ హాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి బత్తుల సత్తిబాబుకు మొదటి సభ్యత్వం అందించారు. నవీన్ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్నవారికి రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నామని, చంద్రన్న బీమా కూడా త్వరలోనే అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, కన్నబాబు, భరత్‌బాబు, మంగ రౌతు రామకృష్ణ, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, జనపరెడ్డి బాబు, బదిరెడ్డి అచ్చన్న దొర, పాలూరి బోస్‌బాబు, అనుకుల శ్రీకాంత్, అడబాల వెంకటేశ్వరరావు, నీలం శ్రీను, బదిరెడ్డి బాబి, దాసరి సీతారామకృష్ణ, పెద్దాడ వెంకన్న దొర, గునిపే భరత్, నాగం వెంకటపతి ఉన్నారు.

ప్రత్తిపాడు: టీడీపీకి కార్యకర్తలే బలమని కాకినాడ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, సీనియర్ నాయకులు అమరాది వెంకట్రావు, వరుపుల రామకృష్ణ చెప్పారు. మండలంలోని పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, ఏలూరు, లంపకలోవ గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను వారు ప్రారంభించారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు మంతెన శ్రీను, ఇళ్ళ అప్పారావు, పల్లా గోపి, రొంగల సత్యనారాయణ, అడ్డాల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ప్రతీ కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి తెలిపారు. టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. రూ.100 కట్టి ప్రమాద బీమా పొందాలన్నారు.కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వాగు రాజేష్, ఎంసీ చైర్మన్ కర్రోతు గాంధీ, కోరాడ కృష్ణ మోహన్, సామంతుల గోపి, మామిడి శ్రీను పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో సభ్యత్వ నమోదులో కార్యకర్తలు

రేపు చినజీయర్‌స్వామి రాక

ప్రత్తిపాడు, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): చినజీయర్‌స్వామి ఈనెల28న ప్రత్తిపాడు నరేంద్రగిరి శ్రీరామ నామ క్షేత్రానికి విచ్చేస్తున్నట్టు క్షేత్రం కార్యదర్శి రెడ్నం రాజా శనివారం తెలిపారు. ఆంధ్రా భద్రాద్రిపేరుతో నరేంద్రగిరి కొండపై నిర్వహిస్తున్న రామాలయ నిర్మాణాలు స్వామిజీ పరిశీలించి అనంతరం శ్రీరామ పాదకులకు పూజలు నిర్వహిస్తారని, భక్తులు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు.

పశుగణన ప్రారంభం

కోటనందూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో పశుగణన కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేయలని టీడీపీ మండ లాధ్యక్షుడు గాడి రాజుబాబు అన్నారు. శనివారం కెఎమల్లవరంలో పశుగణనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ రత్నతేజ, జనసేన నేత పెనుముచ్చు ప్రవీణ్, పారుపల్లి శ్రీను, వేముల వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉచితంగా గ్యాస్ సిలిండర్లు'

ఏలేశ్వరం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వం ద్వారా అందజేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తుందని, ఏడాదికి 3సార్లు సిలిండర్లు ఉచితంగా ఇస్తుందన్నారు. సమావేశంలో కౌన్సిలర్ అలమండ చలమయ్య, బూర్లు సత్తిబాబు, పాండ్రంకి అప్పారావు, బెల్లాని శ్రీను, కె.వాసు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కిర్లంపూడి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందడంతో కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. కృష్ణవరానికి చెందిన అరిపి సత్తిబాబు (31) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటాడు. గత రెండేళ్ల నుంచి రూ.2 లక్షల అప్పు వల్ల మానసికంగా బాధపడుతున్నాడు. అతడి భార్య పుట్టింటికి వెళ్లిన సమయంలో ఈనెల 21న కొబ్బరితోటలో గడ్డిమందు తాగాడు. వెంటనే ప్రత్తిపాడు ఆసుపత్రికి, మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందడంతో మృతుడి భార్య భవానీ ఫిర్యాదుతో హెచ్‌సీ కేసు నమోదు చేశారు.

రీ సర్వే గ్రామ సభ

ప్రత్తిపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యుజేపురం గ్రామంలో శనివారం ల్యాండ్ రీ సర్వే సభను నిర్వహించారు. స్థానిక సర్వే డీటీ కళ్యాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గ్రామసభలో భూ సంబంధిత సమస్యలకు సంబంధించి 25 మంది అర్జీలు అందజేశారు. ల్యాండ్ రీ సర్వే ప్రయోజనాలను తెలిపారు.



ప్రత్తిపాడు: యుజేపురంలో గ్రామసభ దృశ్యం

యర్రంపాలెంలో...

గండేపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రంపాలెంలో రీ సర్వే గ్రామసభ శనివారం నిర్వహించారు. తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్ భూ సమస్యలపై 33 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వై.వంశీకృష్ణ, సర్వేయర్లు కె.కుమారి, ఎల్.భీమరాజు ఉన్నారు.



జనసేనలో చేరుతున్న వైసీపీ ఎంపీటీసీ, సర్పంచ్

జనసేనలో వైసీపీ ఎంపీటీసీ, సర్పంచ్ చేరిక

రౌతులపూడి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీకి చెందిన శృంగవరం గ్రామ ఎంపీటీసీ గాది రాజుబాబు, బంగారయ్యపేట గ్రామ సర్పంచ్ మాదాసు దొంగాబ్బాయి ప్రత్తిపాడు జనసేన పార్టీ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. వారికి వరుపుల జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

లిబరేషన్ ప్రదర్శన

ప్రత్తిపాడు, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ఆ పార్టీ జాతీయ కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మానుకొండ లచ్చబాబు, కె.జనార్ధన్ నాయకత్వంలో ప్రదర్శన కొనసాగింది. దేవాలయ వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం చూడకూడదని ప్రభుత్వం తెచ్చిన జీవో ఇందుకు ఉదాహరణలని, మోదీ ఆజ్ఞలకు ఇది నిదర్శనమని కూటమి నేతల ఉత్సాహయత బలహీనతలను బహిర్గం పరుస్తుందని పేర్కొన్నారు. ఆందోళనలో జక్కంపూడి రాజు, రాజాల రత్నం, బోడపాటి ఏసుబాబు ఉన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం ధ్వంసం



వీఆర్ పురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డిగూడెంలో అతి పురాతన శ్రీరుద్రకోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రాతి విగ్రహాన్ని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని అర్చకుడు మల్లాది సత్యనారాయణ, స్థానికులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సంతోష్ కుమార్ సిబ్బందితో ఆలయం వద్దకు చేరుకుని విగ్రహ ధ్వంసం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి విచారణ చేపడతామని చెప్పారు.

పోశమ్మగండి ఆలయం వద్ద శుభ్రత పనులు

దేవీపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందూరు గ్రామంలో గండి పోశమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద గోదావరి వరద కొంచెం తగ్గింది. దీంతో ఆలయాన్ని శుభ్రపరుస్తున్నట్టు జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పనులు జరుగుతున్న కారణంగా దర్శనాలను తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. దర్శనం తేదీలు ప్రకటించే వరకు ఆలయ పరిసరాల్లోకి ఎవరూ రావద్దని కోరారు.

అమ్మో పులి!

భయంతో బడికి మానేసిన కొండరెడ్ల విద్యార్థులు



కూనవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో పులి సంచరిస్తోందని గత పది రోజులుగా మీడియాలో కథనాలు రావడంతో ఆ ప్రభావం కొండరెడ్ల విద్యార్థులపై పడింది. పులి తిరుగుతుందన్న భయంతో మండలంలోని కొందరు విద్యార్థులకు పాఠశాలకు వెళ్లడం మానేశారు. భైరవపట్నం గ్రామానికి చెందిన సుమారు 10మంది విద్యార్థులు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పైడిగూడెం పాఠశాలలో చదువుతూ ఉంటారు. వీరు ప్రతిరోజూ కాలి నడకనే పాఠశాలకు వస్తుంటారు. కొంత అడవి మార్గంలో రావాల్సి ఉంటుంది. పులి ఉందన్న భయంతో వీరు పది రోజులుగా పాఠశాలకు రావడం మానేశారు. దీంతో ఉపాధ్యాయురాలు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి అడగ్గా పులి తిరుగుతుందన్న కారణంతో విద్యార్థులు బడికి రాలేపోతున్నారని సమాధానం ఇచ్చారు. దీంతో సదరు ఉపాధ్యాయురాలు అవాక్కయ్యారు.

సత్యదేవుడికి ప్రాకారసేవ

అన్నవరం, అక్టోబరు 26: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

మద్యం షాపు తొలగించాలి

తుని రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.పోలవరం శివారు గండి వద్ద మద్యంషాపు ఏర్పాటుకు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నేపథ్యంలో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మహిళలు రోడ్డుపైకి వచ్చి మద్యంషాపు పునాది రాళ్లు తొలగించి, మద్యం షాపు ఏర్పాటు కుదరదని తెగేసి చెప్పారు. ఎమ్మెల్యే యనమల దివ్యకు షాపు తొలగించాలని వినతిపత్రం అందించగా సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి షాపు తొలగింపునకు ఆదేశాలిచ్చారు. ఆమె వెంట టీడీపీ నాయకులు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగసోమరాజు,పలకా సోమేశ్వరరావు తదితరులున్నారు.

వలంటీర్లను కొనసాగించాలి

ప్రత్తిపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లను కొనసాగించాలని మండల వలంటీర్ల సంఘం డిమాండ్ చేసింది. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మండల వలంటీర్లు శనివారం ఆందోళన నిర్వహించి రూ.10వేలు వేతనం, ఉద్యోగ భద్రత కల్పించి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈనెల 28న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు, వలంటీర్ల సంఘ నాయకుడు ఎం.సతీష్‌కుమార్, పి.భవాని, పి.ప్రశాంతి, దొర, ఆనంద్, ఈశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

ప్రత్తిపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): లంకపలోవలో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ గంటా సత్యానారాయణ జ్ఞాపకార్థంగా నిర్వహించిన శిబిరాన్ని మాజీ సొసైటీ చైర్మన్ గొంతిన సురేష్ ప్రారంభించారు. 200 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. 30 మందిని కేటరాక్ట్ ఆపరేషన్లకు ఎంపిక చేశారు. డాక్టర్ రోహిణి, మండల కో ఆప్షన్ నెంబర్ చంటిబాబు, రేషన్ డీలరు గంటా రాంబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సతీ అనసూయ కళాప్రదర్శన

ప్రత్తిపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గౌరమ్మ వేషాల్లో భాగంగా శనివారం ప్రదర్శించిన సతీ అనసూయ కళా ప్రదర్శన ఆకట్టుకుంది. అనసూయగా రాచపల్లి సత్తిబాబు, వ్యాధిగ్రస్తుడైన భర్తగా యడగాల ఆదినారాయణ, మరదలుగా పక్కుర్తి పుష్ప నటించి మెప్పించారు. కళాకారులకు వస్త్రాల అంకరణ, మేకప్‌ను రాయి సుబ్బారావు, దాడి శ్రీనివాస్‌లు నిర్వహించారు.